


RNI : APBIL/2023/86665

# రాయల్ జర్నలిజం

ద్వి భాషా దినపత్రిక

ROYAL JOURNLISAM

గుంటూరు, సంపుటి : 03 సంచిక : 115 | ఆదివారం 21 - 12 - 2025 | చీఫ్-ఎడిటర్ : చల్లా శ్రీనివాసరావు | పేజీలు : 8 వెల : రూ.2-00

GUNTUR VOL-03 ISSUE - 115 CHIEF EDITOR : CHALLA SRINIVASA RAO 21 SUNDAY DECEMBER 2025 PAGES : 8 Rs :2-00

## జిల్లాలోని బీచ్ ల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి



**రాయల్ జర్నలిజం (వేటపాలెం), డిశంబర్ 20 :** రెండు తెలుగు రాష్ట్రాల నుంచి బాపట్ల జిల్లాలోని బీచ్ లకు పర్యాటకులు అధికంగా రావడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి నెల 3వ శనివారం జిల్లాలో నిర్వహించే స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో బాగంగా శనివారం ఉదయం బాపట్ల జిల్లా,వేటపాలెం మండలం,రామాపురం గ్రామంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో చీరాల నియోజకవర్గం ఎమ్మెల్యే యం.యం.కొండయ్య, తో కలసి జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల నుంచి బాపట్ల జిల్లాలోని బీచ్ లకు పర్యాటకులు అధికంగా రావడం జరుగుతుందని, పర్యాటకులను ఆకర్షించే విధంగా జిల్లాలోని సముద్ర తీర ప్రాంతంలో ఉన్న బీచ్లను అభివృద్ధి చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇటీవల జరిగిన జిల్లా కలెక్టర్ సమావేశంలో కూడా ప్రత్యేకంగా చర్చించడం జరిగిందని, బీచ్ ల అనుసంధానం చేస్తూ నేషనల్ హైవే రోడ్లును అభివృద్ధి చేయుటకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందని ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాని తెలిపారు. జిల్లాలోని అన్ని బీచ్ లను పరిశుభ్రంగా చేయవలసిన బాధ్యత మనపై ఉందన్నారు. జిల్లాలో పొట్టి సుబ్బయ్య పాలెం నుంచి నిజాంపట్నం వరకు ఉన్న బీచ్లను అభివృద్ధి చేయడంతో పాటుగా పరిశుభ్రంగా చేయుటకుఇకపై ప్రతి శుక్రవారం, సోమవారం రోజుల్లో బీచ్లు పరిశుభ్రతపై ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. మన బీచ్ లు, మన కుటుంబం, మన గ్రామాలు అనే విధంగా పరిశుభ్ర చేయడం జరుగుతుందని తెలిపారు. మన ఇంట్లో ఉన్న గుడిని ఏ విధంగా శుభ్రంగా ఉంచుకుంటామో అదేవిధంగా మన ప్రాంతం జిల్లాలో ఉన్న బీచ్లను పరిశుభ్రంగా ఉండేటట్టు చూడవలసిన బాధ్యత అధికారులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజల పై ఉందన్నారు. ప్రతి బీచ్లు సమీపంలో ఉన్న గ్రామాల్లోని ప్రతి ఇంటికి మరుగుదొడ్లు నిర్మించడంతోపాటు మహిళలకు, పురుషులకు వేరువేరుగా సామూహిక మరుగుదొడ్లను నిర్మించడం జరుగుతుందన్నారు. బీచ్ లు ఉన్న ప్రాంతాల్లోనే ప్రతి ఇంటి వద్ద ఉపాధి హామీ పథకం ద్వారా ఇంకుడు గుంతను ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని డ్వామా పీడిని ఆదేశించారు. పర్యాటకులు అధిక సంఖ్యలో రావడం వల్ల మన తలసరి ఆదాయం కూడా అధికంగా పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలో చీరాల బీచ్ అంటేనే ఒక ప్రత్యేకత ఉందని, ప్రధానంగా రామపురం బీచ్ కి వారానికి సుమారుగా 20 వేల పైన పర్యాటకులు వస్తుంటారని వారి అందరికీ అన్ని రకాల మౌలిక సౌకర్యాలను కల్పించాలన్న ఉద్దేశంతో జిల్లా కలెక్టర్ తో చర్చించడం జరిగిందని తెలిపారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా మరుగుదొడ్లు లేని కుటుంబాలు ఉండటం వల్ల కొద్దిగా అపరిశుభ్రతంగా ఉంటుందని,మరుగుదొడ్లు లేని కుటుంబాలకు వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టడానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. బీచ్ లో గండ్లు పడడం జరిగిందని వీటిని అన్నిటిని ఈనెల ఆఖరి కల్లా పూర్తి చేయుటకు కాంట్రాక్టర్ ల తో చర్చించడం జరిగిందని తెలిపారు.




2026 జనవరి 1 నుండి ఈ బీచ్ కు వచ్చే ప్రజలకు అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పించడం జరుగుతుందని తెలిపారు. అంతకుముందు స్థానిక ఎమ్మెల్యే తో కలిసి విద్యార్థులచే పరిశుభ్రతపై ఏర్పాటు చేసిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం అక్కడ వివిధ శాఖలు ఏర్పాటు చేసిన పీఎం సూర్య ఘర్, స్వచ్ఛ్ ఆంధ్ర స్వర్ణాంధ్ర, ఎమ్ ఎస్ ఎమ్ ఈ, ప్రకృతి వ్యవసాయం వంటి అంశాలకు సంబంధించి ఏర్పాటు చేసిన స్టాల్స్ ను జిల్లా కలెక్టర్ ఎమ్మెల్యే తో కలిసి పరిశీలించారు. స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛఆంధ్ర నిర్వహణ పై అందరి చేత ప్రతిజ్ఞ జిల్లా కలెక్టర్ చేయించారు. ఈ కార్యక్రమంలో చీరాల ఆర్డీఓ చంద్రశేఖర్ నాయుడు,సి పి ఓ.ఏ.ఎస్.రాజు,డి యం %డ% హెచ్ ఓ.డాక్టర్ విజయమ్మ, డ్వామా పి డి.విజయలక్ష్మి, వివిధ శాఖల జిల్లా అధికారులు ప్రజలు పాఠశాల ల బాల బాలికలు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రాల ద్వారా లబ్దిదారులకు మంచి సేవలు అందించాలి



**రాయల్ జర్నలిజం (బాపట్ల), డిసెంబర్ 20**

అంగన్వాడి కేంద్రాల ద్వారా లబ్ధిదారులకు మంచి సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ తెలిపారు. మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా స్థాయి కమిటీ సమావేశం శనివారం స్థానిక కలెక్టరేట్ లో జరిగింది. అంగన్వాడి కార్యకర్తలు, ఆయాల పనితీరు బాగుండాలని కలెక్టర్ చెప్పారు. లబ్ధిదారులకు మెరుగైన సేవలు అందేలా కృషి చేయాలన్నారు. అంగన్వాడి కార్యకర్తలు, ఆయాల పనితీరు ఆధారంగా వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరు చిత్తశుద్ధితో పనిచేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు చేర్చాల్సిన బాధ్యత కార్యకర్తలు, ఆయాలపై ఉందన్నారు. ఐదు అంగన్వాడి కార్యకర్తల పోస్టులు ఖాళీ కావడంతో ఆ స్థానంలో ఆయాలకు పదోన్నతి కల్పిస్తూ జిల్లా స్థాయి కమిటీ ఆమోదం తెలిపింది. అలాగే తొమ్మిది మంది ఆయాలు, ముగ్గురు కార్యకర్తలు రాజీనామాలపై కలెక్టర్ ఆమోద ముద్ర వేశారు. అంగన్వాడి కేంద్రాలలో మరుగుదొడ్ల నిర్మాణం, తాగునీటి సౌకర్యం త్వరగా ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో జిల్లా మహిళా సంక్షేమ శాఖ పిడి రాధామాధవి, బాపట్ల, చీరాల, రేపల్లె ఆర్డీవోలు గ్లోరియా, చంద్రశేఖర్, రామలక్ష్మి, సి డి పి ఓ లు, తదితరులు పాల్గొన్నారు.

## 5ఏళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు తప్పక ఇప్పించండి




**రాయల్ జర్నలిజం (చీరాల మండలం వేటపాలెం), డిసెంబర్ 20** అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 5ఏళ్ళలోపు చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు తప్పక ఇప్పించండని బాపట్ల జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్. విజయమ్మ పిలుపునిచ్చారు. పందిళ్ళపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని రామాపురంలో శనివారం పల్స్ పోలియో అవాగహ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పందిళ్ళపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎస్. జయకుమార్ మాట్లాడుతూ పందిళ్ళపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 3655 మంది చిన్నారులకు ఆదివారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకూ చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు అందజేయడం జరుగుతుందని, ఇందుకోసం 27 బూతులు ఏర్పాటు చేయడం జరిగిందని, ఒక మొబైల్ టీం అందుబాటులో ఉంటుందని, అదేవిధంగా బస్టాండ్లు, రైల్వేస్టేషన్ లోనూ ఏర్పాటు చేశామని, తల్లిదండ్రులు తమ 5ఏళ్ళలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ వి. లోకేష్, పీహెచ్‌సీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అమరజీవి జలధారకు శ్రీకారం-శంకుస్థాపనలో పవన్ కళ్యాణ్

రాయల్ జర్నలిజం (అమరావతి) డిసెంబర్ 20 : తెలుగువారి త్యాగ చరిత్రకు, ఆత్మగౌరవ పోరాటాలకు శాశ్వత స్మరణగా నిలిచేలా "అమరజీవి జలధార" అనే పేరు ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ పేరుకు వెనుక ఉన్న భావన తెలుగువారి చైతన్యాన్ని, ఐక్యతను గుర్తు చేస్తోంది. తెలుగువారంతా ఒకే రాష్ట్రంగా ఏకమవ్వాలనే మహత్తర లక్ష్యంతో తన పదవినే త్యాగం చేసిన నాయకుడు బూర్గుల రామకృష్ణారావు తెలుగునాటి రాజకీయ చరిత్రలో చిరస్థాయిగా నిలిచారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా సేవలందించిన ఆయన, ప్రజల ఐక్యత కోసం స్వచ్ఛందంగా పదవి విడిచిపెట్టిన త్యాగశీలి. అలాగే, తెలుగు భాషకు, తెలుగు జాతి ఆత్మగౌరవానికి ప్రాణత్యాగం చేసిన మహానుభావుడు అమరజీవి పొట్టి శ్రీరాములు. మద్రాస్ ప్రెసిడెన్సీ కాలంలో తెలుగువారి ఉనికే ప్రశ్నార్థకంగా మారిన పరిస్థితుల్లో, ప్రత్యేక తెలుగు రాష్ట్రం కోసం నిరాహార దీక్ష చేసి తన ప్రాణాలను అర్పించి చరిత్ర సృష్టించారు. ఈ నేపథ్యంలో పొట్టి శ్రీరాములు ని ఒక కులానికి మాత్రమే పరిమితం చేయడం పట్ల పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క కులం కోసం కాదు రాష్ట్రంలో ఉన్న ప్రతి ఒక్కరి కోసం ప్రాణత్యాగం చేసిన నాయకుడిని కుల పరిమితుల్లో బంధించడం సరికాదని వారు అభిప్రాయపడుతున్నారు. ఈ భావోద్వేగ నేపథ్యంతోనే "అమరజీవి జలధార" అనే నామకరణం మరింత అర్థవంతంగా మారింది. ఇది కేవలం నీటి ప్రాజెక్ట్ మాత్రమే కాకుండా, తెలుగువారి త్యాగాలకి, ఐక్యతకి, చైతన్యానికి ప్రతీకగా నిలుస్తోంది. అమరజీవి జలధార ప్రాజెక్ట్ శంకుస్థాపన కార్యక్రమంలో గౌరవ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పాల్గొనడం ఈ పేరుకు మరింత గౌరవాన్ని, ప్రాధాన్యతను చేకూర్చిందని రాజకీయ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. అమరజీవుల త్యాగ



స్ఫూర్తితో ఈ జలధార నీటిలా ప్రవహిస్తూ, రాబోయే తరాలకు ఆదర్శంగా నిలవాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు.

## డిజిటల్ సేవలతో అంగన్వాడీలకు బలం

- సీఎం నారా చంద్రబాబు నాయుడు కానుకగా 5జీ మొబైల్స్
- నియోజకవర్గంలో 489 మందికి పంపిణీ
- అంగన్వాడీలకు 5G ఫోన్లు అందజేసిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

రాయల్ జర్నలిజం (బాపట్ల)డిసెంబర్ 20: అంగన్వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసిందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చొరవతో అంగన్వాడీ కార్యకర్తలకు 5G స్మార్ట్ ఫోన్లు అందించే కార్యక్రమం ఘనంగా నిర్వహించామని తెలిపారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్లు, కార్యకర్తలు, ప్రాజెక్టు అధికారులకు ఎమ్మెల్యే ఏలూరి స్వయంగా 5G మొబైల్ ఫోన్లు అందజేశారు. ఈ నియోజకవర్గ పరిధిలో మొత్తం 489 మంది అంగన్వాడీ సిబ్బందికి 5G ఫోన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం ఆర్థికాభివృద్ధి దిశగా వేగంగా ముందుకు సాగుతోందని అన్నారు.




**డిజిటల్ సాంకేతికతతో పారదర్శక సేవలు**

5G మొబైల్ ఫోన్ల ద్వారా అంగన్వాడీ సేవలు మరింత పారదర్శకంగా, వేగంగా ప్రజలకు చేరుతాయని ఎమ్మెల్యే వివరించారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం, పోషకాహార వివరాలు, హాజరు నమోదు, ప్రభుత్వ పథకాల అమలు వంటి అంశాలను మొబైల్ యాప్‌ల ద్వారా సమర్థవంతంగా నిర్వహించవచ్చని తెలిపారు.

**గ్రామస్థాయిలో కీలక పాత్ర**

అంగన్వాడీ కార్యకర్తలు గ్రామస్థాయిలో ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి, ప్రభుత్వం అమలు చేస్తున్న పోషకాహార పథకాలు, కిట్ల వివరాలను ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. అంగన్వాడీల ద్వారా అందించే పోషకాహారం ఎక్కడా దుర్వినియోగం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పిల్లలు, గర్భిణీలు, బాలింతలకు పూర్తి స్థాయిలో లబ్ధి చేకూరేలా బాధ్యతాయుతంగా పనిచేయాలని కోరారు.

**అంగన్వాడీలే గ్రామాభివృద్ధికి పునాది**

గ్రామాల అభివృద్ధిలో అంగన్వాడీ కార్యకర్తల పాత్ర అత్యంత కీలకమని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజల వరకు చేరాలంటే అంగన్వాడీల కృషి అవసరమని, అందుకే వారికి ఆధునిక సదుపాయాలు కల్పిస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు.

**డిజిటల్ అంగన్వాడీల దిశగా అడుగు**

5G మొబైల్స్ ద్వారా రియల్‌టైమ్ డేటా నమోదు, ఆన్‌లైన్ నివేదికలు, వీడియో ఆధారిత శిక్షణలు పొందే అవకాశం ఉంటుందని చెప్పారు. దీని వల్ల అంగన్వాడీ కేంద్రాల పనితీరు మెరుగుపడటంతో పాటు తల్లులు, పిల్లలకు మరింత మెరుగైన సేవలు అందుతాయని అన్నారు.

**ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి**

క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఏలూరి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. గ్రామ, మండల స్థాయి అధికారులు ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ఆయా అధికారుల స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను తన దృష్టికి లేదా పై అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీ అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని, మిగిలిన పనులను గుర్తించి అంచనాలు సిద్ధం చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సిడిపిఓలు సులోచన, సుభద్ర, అంగన్వాడీ సూపర్వైజర్లు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# శ్రీ భార్గవి హై స్కూల్ నందు ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



రాయల్ జర్నలిజం (కర్లపాలెం), డిసెంబర్ 20: క్రీస్తు బోధనలు సర్వ మానవాళికి ఆచరణీయమని సాల్వేషన్ ఆర్మీ పాస్టర్ బాబురావు అన్నారు. మండల కేంద్రంలోని శ్రీ భార్గవి హై స్కూల్ నందు జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకలలో ఆయన పాల్గొన్నారు. ముందుగా పాఠశాల విద్యార్థులు క్రీస్తు పుట్టుకను గురించి తెలియజేయు విధంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పాఠశాల సెక్రటరీ కరస్పాండెంట్ పేరాల వెంకట సురేష్ ప్రిన్సిపాల్ లక్ష్మి లతో కలిసి పాస్టర్ బాబురావు మందపాటి పరమానంద కుమార్ లు క్రిస్మస్ కేకును కట్ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ పేరాల వెంకట సురేష్ మాట్లాడుతూ ప్రపంచంలోని అతి పెద్ద పండుగ క్రిస్మస్ అన్నారు. నేటి యువత క్రీస్తు బోధనలను ఆచరించాలని సూచించారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు ప్రేమావతి,దివ్య, సునీత, లత రిజ్వానా స్వప్న,బేబీ, లక్ష్మీ ప్రసన్న సాహితీ,సత్య శ్రీ,నవీన్, నాజియా, వసుంధర నాగమ్మ,బిందు లక్ష్మీ దుర్గ, చక్రవర్తి, వేణు, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# మెప్మా ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమం

## పర్యావరణ అనుకూల ఉపాధి అవకాశాలపై అవగాహన సదస్సు




రాయల్ జర్నలిజం (ఒంగోలు) డిసెంబర్ 20 : ప్రతి నెల మూడో శనివారం నిర్వహిస్తున్న స్వర్ణ ఆంధ్ర %-% స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా, శుక్రవారం ఒంగోలులో మెప్మా ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణతో ముడిపడిన ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణలో నైపుణ్యాభివృద్ధి, వ్యర్థాల సేకరణ, వర్గీకరణ, పునర్వినియోగం, రీసైక్లింగ్, సైక్లింగ్ వంటి వినూత్న కార్యకలాపాల ద్వారా ఉపాధి అవకాశాలు ఎలా సృష్టించవచ్చో వివరించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ఆదాయ మార్గాలను పెంపొందించుకోవచ్చని మెప్మా సిబ్బంది అవగాహన కల్పించారు.అలాగే "ఒక కుటుంబం %-% ఒక ఉపాధి" అనే భావనను ప్రజల్లోకి తీసుకెళ్లేలా విస్తృత ప్రచారం నిర్వహించారు. పర్యావరణానికి అనుకూలమైన ఉత్పత్తులు, గ్రీన్ స్టార్టప్ ఆలోచనలపై యువత, మహిళలు ముందుకు రావాలని అధికారులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గౌరవ ఒంగోలు నగర మేయర్ శ్రీమతి గంగాడ సుజాత గారు మాట్లాడుతూ,స్వచ్ఛత, ఉపాధి, స్వయం ఉపాధి లక్ష్యాల సమన్వయమే స్వర్ణాంధ్ర లక్ష్యమని తెలిపారు. పర్యావరణానికి హానికరం కాకుండా జీవనోపాధులు సృష్టించుకోవాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ కే.వెంకటేశ్వర్లు, మెప్మా పీడీ శ్రీహరి, స్కిల్ డెవలప్మెంట్ మేనేజర్ రవితేజ, స్టెప్ ఆఫీసర్, మెప్మా సిబ్బంది, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు. స్వచ్ఛతతో పాటు ఉపాధి కల్పన ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ఈ కార్యక్రమాల ప్రధాన లక్ష్యమని అధికారులు స్పష్టం చేశారు.

# క్యాన్సర్ క్యాంప్ విజయవంతం




**రాయల్ జర్నలిజం (బాపట్ల), డిసెంబర్ 20:**
లయన్స్ క్లబ్ ఆఫ్ బాపట్ల టౌన్, బాపట్ల ప్రాంతీయ ఉపాధ్యాయ సమాఖ్య, ఎన్ జీ ఓ ల సహకారంతో కిమ్స్ చక్ర క్యాన్సర్ హాస్పిటల్ గుంటూరు వారి ఆద్వర్యంలో స్థానిక ఎన్ జీ ఓ హొూమ్ లో శనివారం క్యాన్సర్ క్యాంప్ నిర్వహించడం జరిగినది. ఈ క్యాంప్ కి షుమారు 180 మంది హాజరు అయినారు. వైద్యుల సూచన మేరకు అవసరం అయిన వారికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ చక్ర హాస్పిటల్ వైద్యులు , సిబ్బంది, లయన్స్ క్లబ్ ఆఫ్ బాపట్ల టౌన్ అధ్యక్షులు ఎమ్ జె ఎఫ్ లయన్ దండే యజ్ఞానారాయణ, కార్యదర్శి లయన్ గణేశుల శివరామకృష్ణ, కోశాధికారి లయన్ బొనిగల రాజేంద్రప్రసాద్, బాపట్ల జిల్లా కోఆర్డినేటర్ ఎమ్ జె ఎఫ్ లయన్ గోపాళం రఘుపతి రావు, జోన్ చైర్మన్ లయన్ అలపర్తి శ్రీనివాసరావు, లయన్ ఇక్కుర్తి శ్రీనివాసరావు, లయన్ వక్కలగడ్డ శ్రీనివాసరావు, లయన్ కోళ్లపూడి సుధాకర్ గుప్తా, లయన్ దండే ప్రియాంక పాల్గొన్నారు.

# దేశాభివృద్ధిలో పారిశ్రామికవేత్తల పాత్ర ఎంతో కీలకం




**రాయల్ జర్నలిజం (బాపట్ల), డిసెంబర్ 20:**
దేశాభివృద్ధిలో పారిశ్రామికవేత్తల పాత్ర ఎంతో కీలకమని ఎం ఎస్ ఎం ఈ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కే ఎల్ ఎస్ రెడ్డి అన్నారు. ఆలోచనల నుంచి ఆవిష్కరణ వరకు ఎమ్మెస్ అని ఇన్స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో శనివారం బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో పారిశ్రామిక సదస్సు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖపట్నం కు చెందిన ఎంఎస్ఎమ్ఈ అసిస్టెంట్ డైరెక్టర్ మాట్లాడుతూ ఎంఎస్ఎమ్ఈ ద్వారా అందుబాటులో ఉన్న వివిధ శిక్షణ కార్యక్రమాలు, ఆర్థిక సహాయం, స్టార్టప్ పథకాలు, ఇంక్యుబేషన్ అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. విద్యార్థులు తమ ఆవిష్కరణత్మక ఆలోచనలను స్థిరమైన వ్యాపారాలుగా మార్చుకోవాలని ఆయన విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ విద్యార్థుల్లో వ్యాపార దృక్పథం ఆవిష్కరణత్మక ఆలోచనలు స్వయం ఉపాధి పై అవగాహన పెంపొందించటం లక్ష్యంగా పెట్టుకున్నారు. బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాసరావు, కార్యదర్శి మానం నాగేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి దొడ్డపనేని వెంకయ్య చౌదరి, కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి, ఇన్స్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ అధ్యక్షులు డాక్టర్ షేక్ నజీర్ పాల్గొన్నారు.

# యూరియాను అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు

రాయల్ జర్నలిజం (చీరాల), డిశంబర్ 20 :
రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అవసరమైన మేరకు యూరియా అందజేస్తుందని జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారు. శనివారం చీరల పట్టణంలోని శ్రీ అన్నపూర్ణ ఫెర్టిలైజర్ షాపును జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డును పరిశీలించారు. ఈ సందర్భంగా యూరియా కోసం వచ్చిన రైతుతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యూరియా వ్యాపారస్తులు ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే ఎక్కువగా వసూలు చేస్తున్నారా, మీ గ్రామంలోని రైతు సేవ కేంద్రం ద్వారా ప్రభుత్వం యూరియా అందజేస్తుంది కదా, ఎన్ని ఎకరాలలో పంటలు పెట్టారు, ఉంది ఎంత యూరియా అవసరమవుతుంది, అన్నదాత సుఖీభవ పథకం ద్వారా డబ్బులు వచ్చాయా వంటి వివరాలను రైతును అడిగి జిల్లా కలెక్టర్ తెలుసుకున్నారు. జిల్లాలు ఎక్కడ కూడా యూరియా కొరతలేదని యూరియా అవసరమైన ప్రతి రైతు సమీపంలోనే రైతు సేవ కేంద్రం ద్వారా కొనుగోలు చేసుకోవాలన్నారు తెలిపారు. రసాయనిక ఎరువులు వాడకం తగ్గించుకొని ప్రకృతి వ్యవసాయం చేసుకోవడం వల్ల ఖర్చులు తగ్గి ఆదాయం పెరుగుతుందని కలెక్టర్ రైతు సూచించారు. ఎక్కడైనా అధిక రేట్లకు



యూరియాను అమ్మినట్లయితే జిల్లా కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ 77028 06804 06804 కు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు.కలెక్టర్ వెంట చీరాల రెవిన్యూ డివిజనల్ అధికారి చంద్రశేఖర్ నాయుడు ఇన్చార్జిల్లా వ్యవసాయ అధికారిని అన్నపూర్ణ తదితరులు ఉన్నారు.

# పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



రాయల్ జర్నలిజం (పర్చూరు), డిసెంబర్ 20

ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర భాగస్వాములు కావాలని అలాగే మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నియోజకవర్గపు ప్రత్యేక అధికారి డిప్యూటీ కలెక్టర్ ఎస్. లవన్న పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రతినెలా మూడో శనివారం పారిశుధ్యం పై చేపడుతున్న ప్రత్యేక డ్రైవ్ లో భాగంగా స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం నుండి ప్లకార్డులతో ర్యాలీ చేపట్టారు. ఇంకొల్లు రోడ్డు గుండా బొమ్మలు సెంటర్ కు చేరుకున్నారు. మానవహారంగా ఏర్పడ్డారు .ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలు చెత్తను ఎక్కడపడితే అక్కడ పడవే వద్దని సూచించారు. పరిసరాలు బాగుంటేనే ప్రజల ఆరోగ్యం బాగుంటుందని అందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఆర్థిక అంశాలపై కూడా ప్రజలు అవగాహన పెంచుకోవాలని తెలిపారు. అనంతరం స్వచ్ఛ్ ఆంధ్ర స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ సంశుద్దీన్, కూటమి పార్టీ నాయకులు ఆకుల శ్రీనివాసరావు, అడపాలకృష్ణ, షేక్ గౌస్ బాషా, తాసిల్దారు పి బ్రహ్మయ్య , ఏవో శకుంతల, సీనియర్ సహాయకులు పి నారాయణరావు, డిప్యూటీ ఎంపీడీవో లు ఎం. శ్రీనివాసరావు, షేక్ అబ్దుల్ ఖాదర్ జిలాని, సిడిపిఓ సుభద్ర, హౌసింగ్ ఏ.ఇ. ఏం.రామకృష్ణ, ఏపీఎం కె. రామకృష్ణ, విఆర్ఓ శ్రీనివాసరావు, ఏ పీ ఓ రమేష్, రోటరీ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్, ఏ.జీ ఎన్ శ్రీనివాసరావు, కె.ఎస్. ఆర్ కె.ప్రసాద్, జి.శ్రీనివాసరావు, అంగన్వాడీ కార్యకర్తలు, ఏ. యన్.ఏం లు, పంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీల ఆదాయ వనరుల పెంపుపై శిక్షణ



**రాయల్ జర్నలిజం (పర్చూరు), డిసెంబర్ 20:**
మండల విద్యా వనరుల సమావేశ హాల్లో మండలంలోని అన్ని గ్రామపంచాయతీల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సర్వేయర్లు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులకు, డిఏలుకు గ్రామపంచాయతీ సొంత ఆదాయ వనరులు ఎలా పెంపొందించుకోవాలి అనే అంశంపై శనివారం శిక్షణ ఇచ్చారు. అదేవిధంగా స్వామిత్వ ఏ విధంగా గ్రామాల్లో నిర్వహించాలని వాటిపై కూడా అందరికీ శిక్షణ ఇవ్వడం జరిగినది. ఈ శిక్షణా కార్యక్రమంలో రాష్ట్రస్థాయిలో జరిగిన శిక్షణలో శిక్షణ పొందినటువంటి సిబ్బంది పాల్గొని శిక్షణ ఇచ్చారు. డిప్యూటీ ఎంపీడీవో జి ఎస్ డబ్ల్యూ ఎస్ అబ్దుల్ ఖాదర్ జిలాని మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాల ఆధారంగా గ్రామ పంచాయతీల సొంత ఆదాయ వనరులు పెంపుకు కృషి చేయాలని తెలిపారు. పంచాయతీల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. సిబ్బంది సకాలంలో హాజరు వేయాలని సూచించారు. అలాగే ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్వేలను సకాలంలో పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఎం.శ్రీనివాసరావు, ఏవో శకుంతల, సీనియర్ సహాయకులు పి.నారాయణ రావు అన్ని గ్రామ పంచాయతీల , సచివాలయం సిబ్బంది పాల్గొనన్నారు.

# సుజాత విద్యానికేతన్‌లో అంతర్జాతీయ యోగ ధ్యాన దినోత్సవ వేడుకలు




:హసన్‌పర్తి మండల కేంద్రంలోని 66వ డివిజన్‌లో ఉన్న సుజాత విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ యోగ%-%ధ్యాన దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల యజమాన్యం ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ ఆకుతోట శాంతారామ్ కర్ణ మాట్లాడుతూ, ఐక్యరాజ్యసమితి డిసెంబర్ 21ను ప్రపంచ ధ్యాన దినోత్సవంగా గుర్తించడం మన దేశానికి లభించిన గొప్ప గౌరవమని అన్నారు. సమకాలీన వేగవంతమైన జీవనశైలిలో పెరుగుతున్న ఒత్తిడి, మానసిక ఆందోళనలకు ధ్యానం చక్కటి పరిష్కారమని వివరించారు. ధ్యానం భారతదేశానికి చెందిన పురాతన జీవన విధానమని, ఇది భావోద్వేగ సమతుల్యతను పెంపొందించి న్యూరో ప్లాస్టిసిటీపై సానుకూల ప్రభావం చూపుతుందని తెలిపారు. యోగ, ధ్యానాలను విద్యార్థులు ప్రతిరోజూ అలవాటు చేసుకుంటే మానసిక ప్రశాంతత ఏర్పడి చదువుపై ఏకాగ్రత పెరుగుతుందని చెప్పారు. "ఆరోగ్యమే మహాభాగ్యం" అన్న సూక్తికి అనుగుణంగా ధ్యానం అంతర్గత శాంతిని పెంపొందించి శారీరక మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందని, రోగ నిరోధక శక్తిని బలోపేతం చేసి హృదయ ఆరోగ్యం, రక్తపోటు, షుగర్ వంటి సమస్యలను నియంత్రించడంలో సహకరిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు భారతీయ జీవన విధానంలో అంతర్భాగమైన యోగా, ధ్యానాలను ఇప్పటి నుంచే అలవాటు చేసుకుని ఉన్నత విద్యల్లో రాణించి ఆనందమయమైన భవిష్యత్తును నిర్మించుకోవాలని శాంతారామ్ కర్ణ ఉద్బోధించారు. ప్రపంచ స్థాయిలో ధ్యానానికి గుర్తింపు రావడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ, భావి భారత పౌరులుగా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి సామూహిక ధ్యాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ గూడూరు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు జూపాక నాగరాజు, ఈ వెంకట్, అచ్యుత్ రెడ్డి, పి. వెంకటేశ్వర్లు, ఈ ప్రవీణ్, వై. అరుణ, సిహెచ్. సంధ్య, సిహెచ్. సుచిత్ర, టి. గీత, ప్రవళిక, రాధాకుమారి, సబిహా, సరిత, దేవిక, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# రూ.3 కోట్ల ఇన్సూరెన్స్ కోసం కన్నతండ్రి హత్య.. రెండుసార్లు పాము కాటుతో దారుణం చేసిన కొడుకులు



డబ్బుపై ఆశ మనిషిని ఎంత దారుణానికైనా తెగించేలా చేస్తుందన్న మాటకు తమిళనాడులో చోటుచేసుకున్న ఈ ఘటన నిదర్శనంగా నిలిచింది. తిరువళ్లూరు జిల్లాలో ఇద్దరు కుమారులు రూ. 3 కోట్ల ఇన్సూరెన్స్ సొమ్ము కోసం కన్నతండ్రినే అత్యంత పాశవికంగా హత్య చేసిన ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ప్రమాదవశాత్తు జరిగిన మరణంలా కనిపించిన ఈ కేసు వెనుక భయంకరమైన కుట్ర దాగి ఉందన్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తిరువళ్లూరు జిల్లా పొదటూర్‌పేట్‌కు చెందిన ఈపీ గణేశన్ (56) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ల్యాబ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. అక్టోబర్ 22న ఆయన ఇంట్లోనే పాము కాటు వల్ల మృతి చెందారు. ఈ ఘటనపై ఆయన కుమారుడు మోహన్‌రాజ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మొదట పోలీసులు దీనిని సాధారణ మరణంగా నమోదు చేశారు. అయితే గణేశన్ మరణించిన వారం రోజుల్లోనే ఆయన కుమారులు భారీ బీమా క్లెయిమ్ కోసం దరఖాస్తు చేయడం అనుమానాలకు దారితీసింది. గణేశన్ పేరు మీద ఆదాయానికి మించి రూ. 3 కోట్ల విలువైన ఇన్సూరెన్స్ పాలసీలు ఉండటాన్ని గమనించిన బీమా అధికారులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఈ కేసును ఐజీ అస్రా గార్గ్, ఎస్పీ వివేకానంద శుక్లా దృష్టికి తీసుకెళ్లగా, ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేశారు. సిట్ విచారణలో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. నిందితులైన కుమారులు మోహన్‌రాజ్ (26), హరిహరన్ (27) ఇద్దరూ ప్రైవేట్ ఉద్యోగులు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, ఇతర వ్యసనాల వల్ల భారీ అప్పుల్లో కూరుకుపోయిన వారు. తండ్రి మరణిస్తే ఇన్సూరెన్స్ డబ్బుతో పాటు ప్రభుత్వ ఉద్యోగం కూడా వస్తుందన్న ఆశతో ఈ దారుణానికి పాల్పడ్డారని పోలీసులు తెలిపారు. పోలీసుల విచారణ ప్రకారం, అక్టోబర్ 15న తొలిసారిగా స్నేహితుల సహాయంతో అటవీ ప్రాంతం నుంచి ఒక నాగుపామును తీసుకొచ్చి, నిద్రిస్తున్న తండ్రి కాలుపై కాటు వేయించారు. అయితే సమయానికి ఆస్పత్రికి తరలించడంతో గణేశన్ ప్రాణాలతో బయటపడ్డారు. మొదటి ప్రయత్నం విఫలం కావడంతో మరింత భయంకరమైన ప్రణాళికకు దిగారు. అక్టోబర్ 22న తెల్లవారుజామున ఈసారి అత్యంత విషపూరితమైన కట్టుపామును తీసుకొచ్చి, నిద్రిస్తున్న తండ్రి మెడపై కాటు వేయించారు. ఈసారి ఆయనను ఆస్పత్రికి తీసుకెళ్లడంలో కావాలనే ఆలస్యం చేయడంతో గణేశన్ ప్రాణాలు కోల్పోయారు. ఫోన్ కాల్ డేటా, నగదు లావాదేవీలు, సీసీటీవీ ఆధారాలను పరిశీలించిన పోలీసులు ఈ హత్య వెనుక ఉన్న కుట్రను పూర్తిగా ఛేదించారు. ఈ కేసులో కుమారులతో పాటు వారికి సహకరించిన స్నేహితులు బాలాజీ, ప్రశాంత్, దినకరన్, నవీన్ కుమార్‌లను కూడా అరెస్ట్ చేశారు. నిందితులు నేరాన్ని అంగీకరించడంతో మొత్తం ఆరుగురిని జైలుకు తరలించారు. ఈ ఘటన డబ్బు ఆశ ఎలా మానవ సంబంధాలనే చిదిమేస్తుందో చూపించే భయానక ఉదాహరణగా నిలుస్తోందని పోలీసులు వ్యాఖ్యానిస్తున్నారు.

# మీర్‌పేట మాధవి కేసులో షాకింగ్ నిజం..

## మరదలితో అక్రమ సంబంధమే హత్యకు దారి తీసింది



మీర్‌పేట మాధవి హత్య కేసులో ఊహించని కీలక మలుపు తిరిగింది. ఈ ఘాతుకానికి కారణం ఏంటన్న దానిపై ఇప్పటివరకు ఉన్న అనుమానాలకు ముగింపు పలుకుతూ, నిందితుడు గురుమూర్తికి తన మరదలితో ఉన్న వివాహేతర సంబంధమే హత్యకు ప్రధాన కారణమని కోర్టు విచారణలో తేలింది. హైదరాబాద్ శివారు మీర్‌పేటలో జరిగిన ఈ దారుణ హత్య తెలుగు రాష్ట్రాలను షాక్‌కు గురిచేసిన సంగతి తెలిసిందే. రంగారెడ్డి జిల్లా కోర్టులో కొనసాగుతున్న రోజువారీ విచారణలో, పోలీసులు సమర్పించిన ఆధారాలు ఈ కేసు వెనుక ఉన్న భయంకర నిజాన్ని బయటపెట్టాయి. ఏపీ ప్రకాశం జిల్లాకు చెందిన పుట్ట గురుమూర్తి, వెంకట మాధవిలకు 13 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే గురుమూర్తి తన మరదలితో అక్రమ సంబంధం కొనసాగించడంతో దంపతుల మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈ విషయంపై గ్రామ పెద్దల సమక్షంలో పలుమార్లు పంచాయితీలు జరిగినా, గురుమూర్తి ప్రవర్తనలో మార్పు రాలేదు. తన సంబంధానికి అడ్డుగా ఉన్న భార్యను శాశ్వతంగా తొలగించాలనే కృరమైన ఆలోచనతో, ఈ ఏడాది సంక్రాంతి సమయంలో మాధవిని హత్య చేసినట్లు దర్యాప్తులో తేలింది. మాజీ ఆర్మీ అధికారి కావడంతో నేరం చేసిన తర్వాత సాక్ష్యాలు మిగలకుండా ఎలా వ్యవహరించాలో గురుమూర్తికి బాగా తెలుసు. అందుకే హత్య అనంతరం మాధవి శరీరాన్ని ముక్కలు ముక్కలుగా నరికి, కుక్కర్‌లో ఉడకబెట్టాడు. తర్వాత ఎముకలను పొడిగా చేసి సమీపంలోని చెరువులో పారేసి, ఇది సాధారణంగా కనిపించకుండా జాగ్రత్త పడ్డాడు. అయితే ఎంత పకడ్బందీగా నేరం చేసినా ఒక చిన్న పొరపాటు అతడిని బయటపెట్టింది. నిందితుడి ఇంట్లో లభించిన టిష్యూ పేపర్లపై ఉన్న రక్తపు మరకలు క్లూస్ టీం దృష్టిని ఆకర్షించాయి. వాటిని డీఎన్ఏ పరీక్షలకు పంపగా, అవి మాధవివేనని నిర్ధారణ అయింది. ఈ కేసులో ఇప్పటివరకు పోలీసులు 36 మందిని సాక్షులుగా నమోదు చేయగా, అందులో 20 మంది విచారణ పూర్తయింది. ఫోరెన్సిక్ నిపుణులు నిర్వహించిన డీఎన్ఏ పరీక్షల్లో లభించిన నమూనాలు మాధవి తల్లి, పిల్లల డీఎన్ఏతో సరిపోలాయి. ఇది నిందితుడి నేరాన్ని నిరూపించడంలో కీలక ఆధారంగా మారింది. ఒక మాజీ ఆర్మీ అధికారి, వివాహేతర బంధం కోసం భార్యను ఇంత క్రూరంగా హత్య చేసిన తీరు సమాజాన్ని దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. బాధితురాలికి న్యాయం జరగాలని, నిందితుడికి కఠిన శిక్ష విధించాలని మాధవి కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

# గద్దర్ విగ్రహం ఏర్పాటుకు స్థల పరిశీలన



మహబూబ్‌నగర్ నగరంలో ప్రజా గాయకుడు, విప్లవ సాంస్కృతిక ఉద్యమానికి ప్రతీకగా నిలిచిన గద్దర్ గారి విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి ఆర్ అండ్ బి అతిథి గృహం సమీపంలో గల స్థలాన్ని గౌరవ యెన్నం శ్రీనివాస్ రెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గద్దర్ గారు తన పాటల ద్వారా ప్రజల్లో చైతన్యం నింపుతూ సామాజిక న్యాయం, ప్రజాస్వామ్యం, తెలంగాణ ఆత్మగౌరవం కోసం జీవితాంతం అంకితభావంతో పోరాటం చేశారని గుర్తు చేశారు. అలాంటి మహనీయుడి విగ్రహాన్ని మహబూబ్‌నగర్ నగరంలో ఏర్పాటు చేయడం ద్వారా ఆయన సేవలను చిరస్మరణీయంగా నిలిపినట్లవుతుందని పేర్కొన్నారు. గద్దర్ గారి విగ్రహం యువతకు, రాబోయే తరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని, ప్రజా ఉద్యమాల చరిత్రను గుర్తు చేసే కేంద్రంగా మారుతుందని ఎమ్మెల్యే తెలిపారు. విగ్రహం ఏర్పాటు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ స్థల పరిశీలన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రి, హన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి. మహేందర్, కాంగ్రెస్ నాయకులు మైత్రి యాదయ్య, ప్రవీణ్ కుమార్, బొట్టు శీను, తెలుగు గూడెం ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# హిందూ యువకుడి హత్యపై బంగ్లాదేశ్ సీరియస్.. ఏడుగురు నిందితుల అరెస్ట్, ఇంకా ఉద్రిక్తంగానే పరిస్థితులు




బంగ్లాదేశ్‌లో అరాచక శక్తుల ఆగడాలు రోజు రోజుకూ తీవ్రరూపం దాలుస్తున్నాయి. మతపరమైన ఆరోపణలను సాకుగా చేసుకుని సామాన్యులపై జరుగుతున్న దాడులు ఆ దేశానికి అంతర్జాతీయంగా చెడ్డపేరు తీసుకొస్తున్నాయి. ఇస్లాంకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశాడన్న ఆరోపణలతో 25 ఏళ్ల హిందూ యువకుడు దీపూ చంద్రదాస్‌ను నిరసనకారులు అమానుషంగా కొట్టి చంపిన ఘటన దేశవిదేశాల్లో తీవ్ర కలకలం రేపింది. ఈ దారుణ హత్యపై భారత్ సహా పలు దేశాల నుంచి తీవ్ర నిరసనలు వెల్లువెత్తడంతో యూనస్ ప్రభుత్వం ఒత్తిడిలోకి వచ్చింది. ఈ నేపథ్యంలో దీపూ చంద్రదాస్ హత్య కేసులో ఇప్పటివరకు ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు బంగ్లాదేశ్ ప్రభుత్వ ప్రధాన సలహాదారు అధికారికంగా ప్రకటించారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారికి కఠిన చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. "మా పాలనలో మూక దాడులకు ఎలాంటి అవకాశం లేదు. మతం పేరుతో హింసకు పాల్పడిన వారిపై కఠినంగా వ్యవహరిస్తాం" అని ఆయన హెచ్చరించారు. ఈ ఘటనపై లోతైన దర్యాప్తు కోసం ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలందరూ సంయమనం పాటించి శాంతియుతంగా వ్యవహరించాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. అయితే అధికారిక ప్రకటనలు ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఇంకా ఆందోళనకరంగానే ఉన్నట్లు సమాచారం. బంగ్లాదేశ్‌లోని పలు ప్రాంతాల్లో హిందూ మైనారిటీలపై దాడులు కొనసాగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో అక్కడ నివసిస్తున్న హిందువుల్లో భయాందోళనలు నెలకొన్నాయి. పరిస్థితులు అదుపులోకి రాకపోవడంతో బంగ్లాదేశ్‌లోని భారత హైకమిషన్ కీలక సూచనలు జారీ చేసింది. అక్కడ నివసిస్తున్న భారతీయ పౌరులు అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని, స్థానిక పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. ఇదిలా ఉండగా, విద్యార్థుల ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన యువనేత షరీఫ్ ఉస్మాన్ హాదీ మృతి రాజధాని ఢాకాలో ఉద్రిక్తతలకు మరింత ఆజ్యం పోసింది. శనివారం ఆయన అంత్యక్రియల సందర్భంగా పెద్ద సంఖ్యలో నిరసనకారులు రోడ్లపైకి రావడంతో భద్రతా బలగాలు అప్రమత్తమయ్యాయి. మొత్తానికి, దీపూ చంద్రదాస్ హత్య కేసులో అరెస్టులు జరిగినప్పటికీ, బంగ్లాదేశ్‌లో మతపరమైన హింసపై ఇంకా అనేక అనుమానాలు, ఆందోళనలు కొనసాగుతున్నాయి. పరిస్థితులు పూర్తిగా చల్లబడాలంటే ప్రభుత్వం మరింత కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# సౌదీ బస్సు ప్రమాద బాధితులకు ఊరట.. రూ.3.07 కోట్లు విడుదల చేసిన తెలంగాణ ప్రభుత్వం



సౌదీ అరేబియాలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన హైదరాబాద్ వాసుల కుటుంబాలకు తెలంగాణ ప్రభుత్వం అండగా నిలిచింది. ఈ ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా అందించేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ. 3.07 కోట్లు మంజూరు చేస్తూ మైనారిటీ సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు మైనారిటీ సంక్షేమ శాఖ జీవో నంబర్ 125 విడుదల చేసింది. మంజూరైన నిధులను తెలంగాణ హజ్ కమిటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఖాతాలో జమ చేయాలని సీఎంవో అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ ఖాతా సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఫతే మైదాన్ బ్రాంచ్‌లో ఉంది. నవంబర్ 17న సౌదీ అరేబియాలోని మదీనా సమీపంలో ఈ ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. హైదరాబాద్‌కు చెందిన ఉమ్రా యాత్రికులు ప్రయాణిస్తున్న బస్సులో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. బస్సులో ప్రయాణిస్తున్న 46 మందిలో 45 మంది సజీవ దహనమవ్వగా, ఒక వ్యక్తి మాత్రమే తీవ్ర గాయాలతో ప్రాణాలతో బయటపడ్డారు. ఈ ప్రమాదంలో హైదరాబాద్, విద్యానగర్ ప్రాంతానికి చెందిన నజీరుద్దీన్ కుటుంబానికి చెందిన చిన్నారుల మరణం మరింత హృదయ విదారకంగా మారింది. రెండేళ్ల నుంచి 12 ఏళ్ల లోపు ఉన్న చిన్నారులంతా ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘటన తర్వాత బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు తాజాగా ఈ పరిహార నిధులను విడుదల చేశారు. మృతి చెందిన వారి కుటుంబాలకు ఈ నిధులు అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ ఉమ్రా యాత్ర కోసం హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాలకు చెందిన మొత్తం 54 మంది యాత్రికులు నవంబర్ 9న హైదరాబాద్ నుంచి జెడ్డాకు బయలుదేరారు. మక్కా, అక్కడి సమీప పవిత్ర స్థలాలను సందర్శించిన అనంతరం నవంబర్ 23న తిరిగి రావాలని వారు ప్రణాళిక వేసుకున్నారు. మక్కా యాత్ర పూర్తయ్యాక, 46 మంది యాత్రికులు బస్సులో మదీనాకు బయలుదేరారు. మరో నలుగురు కారులో మదీనాకు వెళ్లగా, మిగిలిన నలుగురు వ్యక్తిగత కారణాలతో మక్కాలోనే ఉండిపోయారు. అయితే మదీనాకు వెళ్తున్న బస్సులోనే ఈ విషాదకర ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఒక వ్యక్తి అక్కడే కొద్ది రోజులు చికిత్స పొందిన అనంతరం ఇటీవల హైదరాబాద్‌కు తిరిగి వచ్చారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని సమాచారం. మొత్తానికి, ఈ ఘటనలో బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న పరిహారం కొంతమేర ఊరట కలిగిస్తుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా అంతర్జాతీయ యాత్రల్లో భద్రతా చర్యలు మరింత పటిష్టంగా ఉండాలని పలువురు కోరుతున్నారు.

రాయల్ జర్నలిజం
ద్విభాషా దినపత్రిక
ROYAL JOURNLISAM

# ఆ జిల్లా దశ తిరిగింది.. ఏకంగా రూ.96 వేల కోట్లతో మరో భారీ పరిశ్రమ.. శంకుస్థాపనకు రెడీ

అమరావతి :ఆంధ్రప్రదేశ్‌కు బీపీసీఎల్ భారీ రిఫైనరీ ప్రాజెక్టు వస్తోంది. ఈ మేరకు శంకుస్థాపనకు కేంద్రమంత్రిని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆహ్వానించారు. ఆయన కేంద్ర మంత్రులను కలిసి విశాఖ, విజయవాడ మెట్రోలకు ఆమోదం, పూర్వోదయ, సాస్కీ పథకాలకు నిధులు, పోలవరం–నల్లమలసాగర్ ప్రాజెక్టులకు ఆర్థిక సహాయం కోరారు. రాష్ట్ర అభివృద్ధికి, ఆర్థిక ఇబ్బందుల నివారణకు ఈ ప్రాజెక్టులు, నిధులు అత్యవసరమని విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు భారీ ప్రాజెక్ట్ వచ్చింది.. రాష్ట్రంలో బీపీసీఎల్ భారీ రిఫైనరీ ప్రాజెక్టు ఏర్పాటు చేయబోతోంది. ఈ మేరకు శంకుస్థాపనకు రావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పూరీని ఆహ్వానించారు. దేశంలోనే అతిపెద్ద సమీకృత ఇంధన ప్రాజెక్టును రూ.96,862 కోట్ల పెట్టుబడితో బీపీసీఎల్ నిర్మిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టు కోసం 6 వేల ఎకరాలు కేటాయించి, ప్రోత్సాహకాలు కూడా ప్రకటించింది. ఈ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయడానికి కేంద్రం సహకరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్రమంత్రిని కోరారు. అలాగే ఏపీలో సహజ వాయువు, ఎల్ఎన్‌జీ రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు జాతీయ, అంతర్జాతీయ కంపెనీలకు సహాయం చేయాలని చంద్రబాబు కోరారు. ఎల్ఎన్‌జీ టెర్మినల్లను మరింత అభివృద్ధి చేయాలని.. ఏపీ అభివృద్ధిలో గెయిల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్, ఐఓసీఎల్, పెట్రోనెట్ వంటి చమురు కంపెనీలు భాగస్వాములయ్యేలా చూడాలన్నారు. విశాఖపట్నం, విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టులకు ఆమోదం తెలపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను కోరారు. విభజన చట్టంలో ఇచ్చిన హామీ మేరకు ఈ ప్రాజెక్టులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసిన చంద్రబాబు, ఈ రెండు ప్రాజెక్టులకు సంబంధించిన సవరించిన డీపీఆర్‌లను సమర్పించి, వాటి ప్రాధాన్యతను వివరించారు. విశాఖపట్నం, విజయవాడ నగరాల్లో మెట్రో రైలు ప్రాజెక్టుల నిర్మాణం త్వరగా చేపట్టాలని కోరారు. ఈ నగరాలు జనాభా, ఆర్థికంగా వేగంగా విస్తరిస్తున్నాయని, కాబట్టి అక్కడి ప్రజలకు ఆధునిక రవాణా వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ రెండు మెట్రో ప్రాజెక్టులు విభజన చట్టంలో ఇచ్చిన హామీ ప్రకారం చేపట్టాలన్నారు.రాష్ట్ర అభివృద్ధికి ఆర్థిక సహాయం అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు. ఢిల్లీలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర మంత్రులతో వరుస సమావేశాలు నిర్వహించారు. పూర్వోదయ, సాస్కీ, పోలవరం–నల్లమలసాగర్ ప్రాజెక్టులకు నిధుల కేటాయింపుపై ప్రధానంగా దృష్టి సారించారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం, వ్యవసాయానికి నీటిపారుదల వ్యవస్థలను మెరుగుపరచడం, మౌలిక సదుపాయాల కల్పన, పరిశ్రమల విస్తరణ, ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటు, విద్య, వైద్య రంగాలలో సౌకర్యాలు కల్పించడం వంటి అభివృద్ధి పనులకు పూర్వోదయ పథకం కింద పెద్దఎత్తున నిధులు అవసరమని చంద్రబాబు వివరించారు. ఈ పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు గణనీయమైన నిధులు కేటాయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.రాష్ట్రంలో ఆస్తులను అభివృద్ధి చేయడానికి అవసరమైన పనులను చేపట్టడానికి, మూలధన వ్యయం కోసం ప్రత్యేకంగా ఇచ్చే సహాయం కింద నిధులను త్వరగా విడుదల చేయాలని చంద్రబాబు కోరారు. ప్రస్తుతం రాష్ట్రం తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటోందని.. ఈ నిధులు రహదారుల నిర్మాణం, ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటు, సాగునీటి ప్రాజెక్టుల పనులు, ఇళ్ల నిర్మాణం, వైద్య రంగంలో మౌలిక సదుపాయాల కల్పనకు చాలా అవసరం అన్నారు. అందువల్ల స్కీమ్ (సాస్కీ) కింద ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.10,054 కోట్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

# అమరావతికి కొత్త రైల్వే లైన్‌పై కీలక అప్డేట్.. పెద్ద సమస్యే వచ్చింది, నో అంటున్నారు




అమరావతి :ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి కొత్త రైల్వే లైన్ నిర్మాణానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే, గుంటూరు, పల్నాడు జిల్లాల రైతులు భూసేకరణకు బదులుగా భూసమీకరణ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. దీంతో కొత్త తలనొప్పి వచ్చి పడింది. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని, రైతులకు ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపిస్తేనే ప్రాజెక్టు ముందుకు సాగుతుంది అంటున్నారు. ఈ అంశంపై నిర్ణయం తీసుకోవాలని చెబుతోంది రైల్వేశాఖ. ఆంధ్రప్రదేశ్ రాజధానికి కొత్త రైల్వే లైన్‌కు కేంద్రం నుంచి గ్రీన్‌సిగ్నల్ వచ్చిన సంగతి తెలిసిందే. ఎర్రుపాలెం నుంచి నంబూరు వరకు అమరావతి మీదుగా 56.53 కి.మీ ప్లాన్ చేశారు. ఈ మేరకు భూసేకరణపై అధికారులు ఫోకస్ పెట్టగా.. గుంటూరు, పల్నాడు జిల్లా రైతులు కొత్త డిమాండ్‌ను తెరపైకి తీసుకొచ్చారు. కొత్త రైల్వే లైన్ నిర్మాణం కోసం భూసేకరణకు బదులుగా భూసమీకరణ చేయాలని కోరుతున్నారు. వాస్తవానికి రైల్వే అధికారులు మొదట్లో భూసేకరణకు సిద్ధమైనా, రైతులు తీవ్రంగా వ్యతిరేకించారు.. వారు సమీకరణ చేయాలంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం భూముల విషయంలో త్వరగా నిర్ణయం తీసుకోవాలని రైల్వేశాఖ కోరుతోంది. రైతులు భూసేకరణ పద్ధతిని అంగీకరించడం లేదు. బదులుగా, భూసమీకరణ పద్ధతి ద్వారానే తమ భూములను తీసుకోవాలని వారు గట్టిగా పట్టుబడుతున్నారు. భూసమీకరణ అంటే, ప్రభుత్వం నేరుగా భూములను కొనుగోలు చేయకుండా, రైతుల నుంచి భూములను సేకరించి, ఆ భూముల్లో అభివృద్ధి పనులు చేపట్టి, ఆ తర్వాత రైతులకు అభివృద్ధి చేసిన భూములను లేదా ఇతర ప్రయోజనాలను కల్పించడం. రైతులు తమ భూములను భూసేకరణ ద్వారా ఇవ్వడానికి ఇష్టపడకపోవడంతో, రైల్వే అధికారులు క్షేత్రస్థాయిలో పెగ్‌మార్కింగ్ (భూమిని గుర్తించే ప్రక్రియ) కూడా చేయలేకపోయారు. రైతుల నుంచి వస్తున్న వ్యతిరేకతతో పనులు నిలిచిపోయాయి. ఈ సమస్యను పరిష్కరించడానికి, రైల్వేశాఖ రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని కోరుతోంది. ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకుంటేనే ఈ ప్రాజెక్టు ముందుకు సాగుతుంది. రైతుల ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని, వారికి ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపాలని రైతులు ఆశిస్తున్నారు.అమరావతికి కొత్త రైల్వే లైన్.. ఖమ్మం, ఎన్టీఆర్, పల్నాడు, గుంటూరు జిల్లాల్లోని పలు గ్రామాల మీదుగా వెళుతుంది. అయితే పల్నాడు, గుంటూరు జిల్లాల్లోని కొన్ని గ్రామాల రైతులు భూసేకరణకు బదులుగా భూసమీకరణ చేయాలని కోరుతున్నారు. రాజధాని అమరావతి కోసం రెండో విడత భూసమీకరణ చేపట్టే గ్రామాల్లోనే ఈ రైల్వే లైన్ కోసం కూడా భూమిని సమీకరించాలని భావిస్తున్నారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం, ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు, కంచికచర్ల, ఇబ్రహీంపట్నం మండలాలు మీదుగా వెళుతోంది. ఇటు పల్నాడు జిల్లా అమరావతి మండలం, గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం, తాడికొండ మండలం,పెదకాకాని మండలంలోని గ్రామాల మీదుగా రైల్వే లైన్ ప్లాన్ చేశారు. అయితే గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని రైతులు భూసేకరణను వ్యతిరేకిస్తున్నారు.. భూ సమీకరణ చేపట్టాలంటున్నారు. ప్రభుత్వం రైతుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.అమరావతి రైల్వే లైన్ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. రైల్వే లైన్ నిర్మాణం కోసం ఎక్కడైతే భూసేకరణ పూర్తయిందో, అక్కడ ముందుగా పనులు మొదలుపెడతారు. ఈ ప్రాజెక్టును రెండు ప్రధాన భాగాలుగా విభజించారు. మొదటి భాగంలో ఎర్రుపాలెం నుంచి వైకుంఠపురం వరకు 27 కిలోమీటర్ల రైల్వే లైన్ నిర్మిస్తారు. రెండవ భాగంలో కృష్ణా నదిపై 3.2 కిలోమీటర్ల పొడవైన వంతెన కడతారు. ఈ రెండు భాగాలకు సంబంధించిన టెండర్ ప్రక్రియ ఈ నెల చివరి నాటికి పూర్తవుతుందని అధికారులు తెలిపారు. టెండర్లు పూర్తయిన వెంటనే పనులు ప్రారంభించే అవకాశం ఉంది. రైల్వే శాఖ వర్గాల ప్రకారం, గుత్తేదారు సంస్థలకు పనులు అప్పగించిన తర్వాత, రైల్వే లైన్ నిర్మాణం రెండేళ్లలో పూర్తవుతుంది. కృష్ణా నదిపై వంతెన నిర్మాణం మాత్రం మూడేళ్లలో పూర్తవుతుంది. ఇంకా భూసేకరణ జరగాల్సిన గ్రామాల పరిధిలోని పనులను మరో ప్రత్యేక భాగం కింద చేపడతారు. ఈ పనుల వివరాలు త్వరలో వెల్లడిస్తారు. ఈ రైల్వే లైన్ నిర్మాణం పూర్తయితే అమరావతి ప్రాంతంలో రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయి.

# కొత్తగా మరో గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి.. ఆ ప్రాంతానికి మహర్దశ, అమరావతికి కనెక్ట్

అమరావతి :ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలో పరిశ్రమల అభివృద్ధికి కనెక్టివిటీని పెంచే పనిలో ఉంది. ఖరగ్‌పూర్, కటక్, విశాఖపట్నం నుంచి అమరావతి వరకు 446 కిలోమీటర్ల కొత్త గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్రతిపాదనలు తెరపైకి వచ్చాయి. ఇది సరుకు రవాణాను సులభతరం చేయడంతో పాటు, %చీ౧%–16 రద్దీని తగ్గిస్తుంది. ఒంగోలు–కత్తిపూడి మధ్య %చీ౧%–16 విస్తరణ కూడా ప్రతిపాదనలో ఉంది. ఈ ప్రాజెక్టులు అమరావతిని లాజిస్టిక్స్ హబ్‌గా మార్చనున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలో హైవేలపై ఫోకస్ పెట్టింది.. జిల్లాల వారీగా కొత్త పరిశ్రమలు వస్తుండటంతో కనెక్టివిటీని పెంచే పనిలో ఉంది. కేంద్రం సహకారంతో కొత్త హైవే ప్రాజెక్టుల్ని కూడా తీసుకొస్తోంది. తాజాగా మరో కొత్త గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్రతిపాదనలు తెరపైకి వచ్చాయి. ఖరగ్‌పూర్, కటక్, విశాఖపట్నం నుంచి అమరావతి వరకు ఒక కొత్త గ్రీన్‌ఫీల్డ్ హైవేను ప్రతిపాదన వచ్చింది. 446 కిలో మీటర్లు ఈ హైవేను ప్రతిపాదించగా.. సరుకు రవాణా చాలా సులభతరం అవుతుందని భావిస్తున్నారు. ఈ హైవేను అమరావతి అవుటర్ రింగ్ రోడ్డుతో కూడా కనెక్ట్ చేయనున్నారు. పస్తుతం కోల్‌కతా–




చెన్నై జాతీయ రహదారి(%చీ౧%–16)పై వాహనాల రద్దీ విపరీతంగా పెరిగిపోయింది. ఈ సమస్యను అధిగమించడానికి, అమరావతికి ఖరగ్‌పూర్, కటక్, విశాఖపట్నంలతో మెరుగైన అనుసంధానం కల్పించడానికి ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవే ఎంతో ఉపయోగంగా ఉంటుందని కేంద్రానికి ప్రతిపాదించనున్నారు. ఈ కొత్త గ్రీన్‌ఫీల్డ్ హైవే కృష్ణా, ఏలూరు, పోలవరం, చింతపల్లె, పాడేరు, పార్వతీపురం మన్యం మీదుగా కటక్, ఖరగ్‌పూర్ వరకు ప్లాన్ చేస్తున్నారు. ఈ మేరకు కేంద్రాన్ని రిక్వెస్ట్ చేయనున్నారు. ఈ మేరకు ఆర్ అండ్ బీ ఈ హైవేకు సంబంధించిన డీపీఆర్ సిద్ధం చేస్తోంది.. ఇది పూర్తి కాగానే కేంద్రానికి సమర్పించి, ఆమోదం పొందిన తర్వాత టెండర్లు పిలుస్తారు.ప్రస్తుతం ఒంగోలు–కత్తిపూడి మధ్య ఉన్న నేషనల్ హైవే–16కు ప్రత్యామ్నాయంగా.. ఒంగోలు–కత్తిపూడి వయా చీరాల జాతీయ రహదారిని నాలుగు వరుసలకు విస్తరించాలని కూడా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. ఈ విస్తరణ కూడా లాజిస్టిక్స్ రవాణాకు కీలకంగా మారుతుంది. ఈ రెండు ప్రాజెక్టులు అమరావతిని ఒక ముఖ్యమైన లాజిస్టిక్స్ హబ్‌గా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తాయని చెబుతున్నారు అధికారులు. ఇటు విశాఖపట్నం టు రాయ్‌పూర్ నేషనల్ హైవే పనులు కూడా ముగింపు దశకు వచ్చాయి.. ఈ హైవేను కూడా వచ్చే ఏడాదికి అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నారు. మొత్తం మీద రాష్ట్రంలో నేషనల్ హైవేలు, గ్రీన్‌ఫీల్డ్ హైవేలపై ప్రభుత్వం ఫోకస్ పెట్టింది.

# ఇంటర్ ఫెయిల్, టైపిస్ట్ ఉద్యోగం నుంచి బ్యాంక్ ఆఫ్ అమెరికాలో వైస్ ప్రెసిడెంట్‌గా.. తెలుగోడి సక్సెస్ స్టోరీ

అమరావతి :విశాఖపట్నం జిల్లాకు చెందిన సుంకరి వలసయ్య, ఇంటర్‌లో ఇంగ్లీష్‌లో ఫెయిలైనా, ఎన్నో అడ్డంకులను అధిగమించి అమెరికాలోని బ్యాంక్ ఆఫ్ అమెరికాలో సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా 50 ఏళ్ల ఉద్యోగ జీవితాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. టైపిస్ట్‌గా ప్రారంభించి, ఉన్నత శిఖరాలను అధిరోహించిన ఆయన స్ఫూర్తిదాయక ప్రయాణం అందరికీ ఆదర్శంగా నిలిచారు. ఆయన సక్సెస్ స్టోరీ గురించి కుమారుడు చేసిన ట్వీట్ వైరల్ అవుతోంది.విశాఖపట్నం టు అమెరికా.. అగ్రరాజ్యంలో ఓ తెలుగోడి సక్సెస్ స్టోరీ ఇది. ఇంటర్‌లో ఇంగ్లీష్ ఫెయిలైన వ్యక్తి.. ఎన్నో అవరోధాలను దాటుకుని ఉన్నత శిఖరాలను అందుకున్నారు. అమెరికాలోని ప్రముఖ బ్యాంక్‌లో ఉన్నత పదవి చేపట్టి.. ఇటీవలే రిటైర్ అయ్యారు. ఆయనే విశాఖపట్నం జిల్లా పద్మనాభానికి చెందిన సుంకరి వలసయ్య .. ఆయన సక్సెస్ స్టోరీ గురించి కుమారుడు సుధీర్ కుమార్ చేసిన ట్వీట్ వైరల్ అవుతోంది.'ఇటీవల మా నాన్నగారు 50 ఏళ్ల ఉద్యోగ జీవితానికి గుడ్ బై చెబుతూ పదవీ విరమణ చేశారు. 1975లో టైపిస్ట్‌గా తన మొదటి ఉద్యోగంలో చేరి.. 2025లో అమెరికాలోని బోస్టన్‌లో ఉన్న బ్యాంక్ ఆఫ్ అమెరికాలో సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా రిటైర్ అయ్యారు. ఆయన జీవిత ప్రయాణం గురించి కచ్చితంగా చెప్పుకోవాలి.. ఆయన ఎక్కడి నుంచి వచ్చారు, ఏం సాధించారు అని చెప్పడానికి 'అద్భుతం' అనే మాట కూడా సరిపోదనిపిస్తుంది'. '1975లో ఆయన కొన్ని అనుకోని కారణాలతో హైదరాబాద్‌కు వచ్చారు. ఆయన 12వ తరగతి ఇంగ్లీష్ పరీక్షలో ఫెయిల్ అయ్యారు. ఆ విషయం తెలుసుకోవడానికి బోర్డు అధికారులను కలవాలని వచ్చారు. అయితే హైదరాబాద్‌లోనే ఉండి పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేస్తూ, తర్వాత ఫుల్‌టైమ్ ఉద్యోగం సంపాదించుకున్నారు. 1977 జనవరిలో ఆయనకు వచ్చిన మొదటి ఫుల్‌టైమ్ ఉద్యోగ నియామక పత్రం మా దగ్గర ఇప్పటికి ఉంది. అది ICRISATలో ఫీల్డ్ హెల్పర్‌గా.. అంతర్జాతీయ సంస్థ అయిన %×జ=×ూూ%లో ఉన్న సౌకర్యాలను ఆయన బాగా ఉపయోగించుకున్నారు. అక్కడ పనిచేస్తూనే కంప్యూటర్లు, స్క్రిప్టింగ్/ప్రోగ్రామింగ్ నేర్చుకున్నారు. నాకూ, నా సోదరుడికీ మంచి స్కూల్లో అడ్మిషన్ల కోసం.. ఆయన ఉద్యోగం చేస్తూనే ఓపెన్ యూనివర్సిటీలో బ్యాచిలర్స్, మాస్టర్స్ డిగ్రీలు పూర్తి చేశారు'.'%×జ=×ూూ%లో 22 ఏళ్ల పాటూ పనిచేసిన తర్వాత (ఇందులో తైవాన్‌లోని %ూ౨=ఱజ%లో రెండేళ్ల అనుభవం కూడా ఉంది). ఆ తర్వాత 1998లో ఆయనకు అమెరికాలో అవకాశం వచ్చింది. అక్కడ కొన్ని కన్సల్టెంట్ ఉద్యోగాలు చేసిన తర్వాత.. 2000 సంవత్సరంలో బోస్టన్‌లోని బ్యాంక్ ఆఫ్ అమెరికాలో చేరారు. అక్కడే 2025లో రిటైర్ అయ్యారు. ఆయన 2024 వరకు కూడా స్క్రిప్ట్‌లు రాస్తూనే ఉన్నారు. అంటే ఆయన 50 ఏళ్ల ఉద్యోగ జీవితంలో 47 ఏళ్లు కేవలం రెండు కంపెనీల్లోనే పనిచేశారు. ఇది ఆయన స్థిరత్వానికి, విధేయతకు నిదర్శనం'.'ఆ సమయంలో అమెరికా వెళ్లడం



చాలా కష్టమైన పని. నాన్నగారు అక్కడ అలవాటు పడటానికి అమ్మ పాత్ర చాలా గొప్పది. ఆమె ఇక్కడికి వచ్చాక ఇంగ్లీష్ నేర్చుకున్నారు. అలాగే మా అందరికీ అండగా నిలిచారు. కష్టమైన పరిస్థితుల్ని కూడా ఎదుర్కొన్నారు. ఆఫీసు పనితో పాటు, ఆయన సమాజానికి చేసిన సేవ కూడా చాలా గొప్పది. ఆయన చదువుకున్న గ్రామ విద్యార్థుల కోసం, ప్రభుత్వ పాఠశాలల కోసం చేసిన కృషి గురించి తెలుగు న్యూస్ పేపర్లలో వచ్చిన కటింగ్స్ కూడా ఉన్నాయి. నాన్నగారి పేరు వలసయ్య.. 'వలస' అంటే జనాలు ఉపాధి కోసం ఒక చోటు నుంచి మరో చోటుకు వెళ్లడం. ఆయన పేరుకు తగ్గట్టే వలస వెళ్లి.. తాను వచ్చిన ఊరిని మర్చిపోలేదు'.

# టీడీపీ ఎమ్మెల్యేను కలిసిన మాజీ మంత్రి మల్లారెడ్డి.. కత్తి పట్టి ఫోటోలకు ఫోజులు, కాలేజీ కొంటున్నారట!

అమరావతి :తెలంగాణ మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి విజయనగరం జిల్లా బొబ్బిలి కోటను సందర్శించి, చారిత్రక ప్రాధాన్యతను ప్రశంసించారు. టీడీపీ ఎమ్మెల్యే బేబీ నాయనతో కలిసి తాంద్రపాపారాయుడు ఉపయోగించిన కత్తిని పరిశీలించారు. విద్యాసంస్థల విస్తరణ ప్రణాళికల్లో భాగంగా ఆయన ఈ పర్యటన చేపట్టినట్లు తెలుస్తోంది. గతంలో టీడీపీ నుంచి ఎంపీగా, ప్రస్తుతం బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన మల్లారెడ్డి రాజకీయ ప్రస్థానం విశేషం.తెలంగాణ మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి టీడీపీ ఎమ్మెల్యేను కలిశారు. ఆయన విజయనగరం జిల్లా బొబ్బిలి కోటను సందర్శించారు. రెండు శతాబ్దాల నాటి వస్తువులను భద్రపరచడం, మ్యూజియం బాగుండటం అభినందనీయమన్నారు మల్లారెడ్డి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బేబీనాయనతో కలిసి మ్యూజియంలో రాజుల వంశవృక్షానికి సంబంధించిన ఫోటోలను పరిశీలించారు. బొబ్బిలి రాజుల గొప్ప చరిత్రను మల్లారెడ్డి ప్రశంసించారు.. కోట చరిత్రను వివరించినందుకు బేబీనాయనకు కృతజ్ఞతలు తెలిపారు. బొబ్బిలి రాజుల చరిత్ర చాలా గొప్పదని, వారి కోటను సందర్శించడం చాలా సంతోషంగా ఉందన్నారు.తాంద్రపాపారాయుడు ఉపయోగించిన కత్తిని కూడా మల్లారెడ్డి పట్టుకున్నారు.. ఫోటోలు కూడా



దిగారు. తాను బొబ్బిలి కోటతో పాటుగా ఈ ప్రాంతాన్ని చూడాలనే ఉద్దేశంతోనే ఇక్కడికి వచ్చానని తెలిపారు. బొబ్బిలి రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తాంద్రపాపారాయుడు విద్యాసంస్థల కరస్పాండెంట్ భాస్కరరావు కూడా పాల్గొన్నారు. బొబ్బిలిలోని విద్యాసంస్థల స్థానంలో యూనివర్శిటీ ఏర్పాటు చేయాలనే స్థానిక కాలేజీ యాజమాన్యం విన్నపం మేరకు ఇక్కడికి వచ్చినట్లు తెలుస్తోంది.మాజీ మంత్రి మల్లారెడ్డికి హైదరాబాద్‌లో సొంతంగా విద్యా సంస్థలు, ఆస్పత్రులు ఉన్నాయి. డీమ్డ్ యూనివర్శిటీలు, ఇంజినీరింగ్ కాలేజీలు, మెడికల్ కాలేజీలు నడుపుతున్నారు. అయితే ఆయన తెలంగాణతో పాటుగా ఇతర రాష్ట్రాల్లో కూడా యూనివర్శిటీలు, కాలేజీలు స్థాపించాలని ప్లాన్ చేశారు. విశాఖపట్నంతో పాటుగా తిరుపతిలో కొన్ని కాలేజీలను కొనుగోలు చేసినట్లు మల్లారెడ్డి స్వయంగా చెప్పారు. తెలుగు రాష్ట్రాలు మాత్రమే కాదు.. ఇతర రాష్ట్రాల్లో కూడా కాలేజీలను ఏర్పాటు చేయాలని ప్లాన్ చేస్తున్నారు మల్లారెడ్డి. ఈ క్రమంలోనే ఆయన ఆయా కాలేజీలను పరిశీలిస్తున్నారు. ఈ క్రమంలోనే విజయనగరం జిల్లాకు కూడా వెళ్లినట్లు తెలుస్తోంది.చామకూర మల్లారెడ్డి విద్యా సంస్థలు నడిపిస్తూనే రాజకీయాల్లోకి వచ్చారు.. ఆయన టీడీపీలో చేరి 2014 ఎన్నికల్లో మల్కాజ్‌గిరి నుంచి ఎంపీగా విజయం సాధించారు. ఆ తర్వాత తెలంగాణలో రాజకీయ పరిణామాలు మారడంతో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో మేడ్చల్ నుంచి పోటీచేసి ఎమ్మెల్యేగా విజయం సాధించారు.. అనంతరం కేసీఆర్ కేబినెట్‌లో కార్మికశాఖ మంత్రిగా పనిచేశారు. 2018 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసి మళ్లీ మేడ్చల్ నుంచి గెలిచారు.

# హైదరాబాద్ నగరవాసులకు అలర్ట్.. మీ అడ్రస్ మారబోతుంది, ఎందుకంటే..?



హైదరాబాద్‌లో వందకు పైగా కొత్త డివిజన్లు, సుమారు 3 వేల కాలనీల చిరునామాలు మారనున్నాయి. జనగణన తర్వాత నగర పాలనలో పెను మార్పులు, డివిజన్ల సంఖ్య పెంపునకు అవకాశం ఉంది. ఈ మార్పులు పరిపాలనను ప్రజలకు చేరువ చేసి, మౌలిక సదుపాయాల కల్పనను సులభతరం చేస్తాయి.హైదరాబాద్ మహానగర రూపురేఖలు మరోసారి మారనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన డివిజన్ల పునర్విభజన ప్రక్రియతో నగరంలోని వందకు పైగా కొత్త డివిజన్లు అందుబాటులోకి రాగా.. సుమారు 3 వేల కాలనీల చిరునామాలు మారబోతున్నాయి. అయితే.. ఈ మార్పులు ఇక్కడితోనే ఆగిపోవని, రాబోయే రోజుల్లో రాజధానిలో మరిన్ని కీలక భౌగోళిక మార్పులు చోటు చేసుకునే సూచనలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా జనగణన ప్రక్రియ పూర్తయిన తర్వాత నగర పాలనలో పెను మార్పులు సంభవించవచ్చని అధికార వర్గాలు భావిస్తున్నాయి.ఒకప్పుడు 650 చదరపు కిలోమీటర్ల మేర ఉన్న జీహెచ్ఎంసీ విస్తీర్ణం.. చుట్టుపక్కల ఉన్న 27 పట్టణ స్థానిక సంస్థల విలీనంతో ఇప్పుడు ఏకంగా 2053 చదరపు కిలోమీటర్లకు పెరిగింది. ఇంతటి భారీ నగరాన్ని ఒకే గొడుగు కింద పాలించడం అధికారులకు పెను సవాలుగా మారింది. దీనిని దృష్టిలో ఉంచుకుని.. నగరాన్ని ఒకటిగా ఉంచాలా లేక రెండు మూడు మున్సిపల్ కార్పొరేషన్లుగా విభజించాలా అనే అంశంపై ప్రభుత్వం తీవ్రంగా ఆలోచిస్తోంది. అయితే ఈ విభజనపై తుది నిర్ణయం వచ్చే వరకు ప్రస్తుత గ్రేటర్ హైదరాబాద్‌ను యథాతథంగా కొనసాగించాలని సర్కారు ప్రాథమికంగా నిర్ణయించింది.నగర భవిష్యత్తుకు 2027 ఏడాది అత్యంత కీలకం కానుంది. వచ్చే ఏడాది జనవరి నుంచి ప్రారంభం కానున్న జనగణన ప్రక్రియ 2027 నాటికి పూర్తవుతుంది. అప్పుడు వచ్చే జనాభా లెక్కల ఆధారంగా డివిజన్ల సంఖ్యను పెంచే అవకాశం ఉంది. ఒకవేళ అంతకంటే ముందే ఎన్నికలు నిర్వహించాల్సి వస్తే.. ప్రస్తుతం ఉన్న 300 డివిజన్లకే పరిమితం కావచ్చు. కానీ, 2029లో జరిగే అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనను దృష్టిలో ఉంచుకుని 2027లో చేపట్టబోయే డివిజన్ల మార్పులు చాలా పటిష్ఠంగా ఉండబోతున్నాయని అధికారుల అంచనా.ఇటీవల ప్రకటించిన ముసాయిదాపై వచ్చిన అభ్యంతరాలు, ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియను జీహెచ్ఎంసీ అధికారులు విజయవంతంగా పూర్తి చేశారు. ముఖ్యంగా శివరాంపల్లిని సులేమాన్ నగర్‌లో కలపడం, భారతీనగర్ డివిజన్ విభజనలోని లోపాలు, విద్యుత్ నగర్ కాలనీ రెండు డివిజన్లలో ఉండటం వంటి సాంకేతిక సమస్యలపై ప్రజల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులొచ్చాయి. జోనల్ కమిషనర్లతో చర్చించి, హేతుబద్ధంగా ఉన్న విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని హద్దులను సవరించారు. దీనిపై రూపొందించిన తుది నివేదికను సోమవారం ప్రభుత్వానికి సమర్పించనున్నారు. సర్కారు ఆమోదం తెలిపిన మూడు రోజుల్లోనే తుది గెజిట్ వెలువడనుంది.ఈ మార్పుల వల్ల పరిపాలన ప్రజలకు మరింత చేరువవడమే కాకుండా పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పన సులభతరం కానుంది. అయితే, మాటిమాటికీ మారుతున్న డివిజన్ల సరిహద్దుల వల్ల ఓటర్ల నమోదు, సర్టిఫికేట్ల జారీ వంటి అంశాల్లో ప్రజలు కొంత గందరగోళానికి గురయ్యే అవకాశం కూడా ఉంది.

# రోడ్డుపై అలా నడిపితే వెహికల్ సీజ్.. ట్రాఫిక్ ఉల్లంఘనులపై పోలీసుల ఉక్కుపాదం




తెలంగాణలో రహదారి భద్రత తీవ్ర సవాలుగా మారింది. రోజుకు 74 ప్రమాదాలు, 20 మరణాలు సంభవిస్తున్నాయి. ట్రాఫిక్ ఉల్లంఘనలు పెరగడంతో పోలీసులు 'ఎరైవ్.. ఎలైవ్' పేరుతో అవగాహన కార్యక్రమాలు చేపట్టి, నిబంధనలు కఠినతరం చేస్తున్నారు. రాంగ్‌రూట్ డ్రైవింగ్‌పై కఠిన చర్యలు, బాధితుల అనుభవాల ద్వారా మార్పు తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు.తెలంగాణలో రహదారి భద్రత పెను సవాలుగా మారింది. ప్రస్తుత గణాంకాలు విశ్లేషిస్తే పరిస్థితి ఎంత ఆందోళనకరంగా ఉందో స్పష్టమవుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రతిరోజూ సగటున 74 ప్రమాదాలు జరుగుతుండగా సుమారు 20 మంది ప్రాణాలు కోల్పోతున్నారు. అంటే బయటకు వెళ్లిన వ్యక్తి క్షేమంగా ఇంటికి వస్తాడన్న నమ్మకం కలగని పరిస్థితి నెలకొంది. నిత్యం నమోదవుతున్న 72 వేల ట్రాఫిక్ ఉల్లంఘనలే ఈ మరణమృదంగానికి ప్రధాన కారణమని తెలుస్తోంది. గతేడాది రోజుకు సగటున 52 వేల ఉల్లంఘనలు నమోదు కాగా.. ఈ ఏడాది ఆ సంఖ్య ఏకంగా మరో 20 వేలు పెరగడం వాహనదారుల నిర్లక్ష్యానికి పరాకాష్టగా నిలుస్తోంది.ఈ ప్రమాద ఘంటికల నేపథ్యంలో తెలంగాణ పోలీసు శాఖ అత్యంత అప్రమత్తమైంది. కేవలం జరిమానాలతో మార్పు రాదని గుర్తించిన అధికారులు, నిబంధనలను కఠినతరం చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా 'ఎరైవ్.. ఎలైవ్' పేరుతో రాష్ట్రవ్యాప్తంగా భారీ అవగాహన కార్యక్రమాలను ఇప్పటికే ప్రారంభించారు. రాబోయే రోజుల్లో ఈ ప్రచారాన్ని మరింత ఉధృతం చేయడంతో పాటు, నిబంధనలు మీరే వారిపై ఉక్కుపాదం మోపనున్నారు. ముఖ్యంగా అతివేగం, సిగ్నల్ జంపింగ్, మద్యం తాగి వాహనం నడపడం వంటి ప్రాణాంతక తప్పిదాలపై ప్రత్యేక నిఘా పెట్టనున్నారు.మరింత కఠినమైన చర్యల్లో భాగంగా.. హైవేలపై రాంగ్‌రూట్‌లో ఎదురుగా వచ్చే వాహనాలను అక్కడికక్కడే స్వాధీనం చేసుకునే యోచనలో పోలీసులు ఉన్నారు. హైవేలపై అడ్డగోలుగా ప్రయాణించి ఎదుటివారి ప్రాణాలను బలితీసుకునే సంస్కృతికి చెక్ పెట్టడమే దీని లక్ష్యం. కేవలం శిక్షలే కాకుండా, మానవీయ కోణంలోనూ మార్పు తెచ్చేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. రహదారి ప్రమాదాల్లో తమ వారిని కోల్పోయిన కుటుంబాల చేత బాధితుల అనుభవాలను పంచుకోనున్నారు. ఆ కుటుంబాల క్షోభను వినడం ద్వారా అయినా వాహనదారుల్లో పరివర్తన వస్తుందని తద్వారా రక్తం చిందించే రహదారులను సురక్షితంగా మార్చవచ్చని పోలీసు యంత్రాంగం భావిస్తోంది.

# ఎలక్ట్రిక్ వాహనం కొనండి.. బహుమతి పొందండి.. మంత్రి పొన్నం కీలక ఆదేశాలు



హైదరాబాద్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించడానికి భారీ రాయితీలు అందిస్తోంది. %జుఎ% కొనుగోలుదారులకు మొక్కలు బహుమతిగా ఇవ్వాలని, ప్రభుత్వ శాఖల్లో 20 శాతం %జుఎ%ల కొనుగోలు తప్పనిసరి చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. ఛార్జింగ్ స్టేషన్ల విస్తరణతో పాటు రహదారి భద్రతపై అవగాహన కల్పించాలని కంపెనీలను కోరారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించడానికి వినూత్న చర్యలు చేపడుతోంది. పర్యావరణాన్ని కాపాడుకోవడంలో భాగంగా ప్రభుత్వం ఆర్థిక నష్టాన్ని లెక్కచేయకుండా భారీగా రాయితీలు కల్పిస్తోందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఎలక్ట్రిక్ వాహన తయారీదారులు, డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన కీలక నిర్ణయాలను, భవిష్యత్తు ప్రణాళికలను వెల్లడించారు.పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచేందుకు మంత్రి ఒక వినూత్న ప్రతిపాదనను డీలర్ల ముందు ఉంచారు. ఎలక్ట్రిక్ వాహనం కొనుగోలు చేసే ప్రతి వినియోగదారునికి ఒక మొక్కను బహుమతిగా ఇచ్చి.. వారిని పర్యావరణ ప్రేమికులుగా మార్చాలని సూచించారు. ఈ చిన్న మార్పు సమాజంలో కాలుష్య నివారణపై పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కేవలం వాహనం అమ్మడమే కాకుండా, పచ్చదనాన్ని పెంచడంలో డీలర్లు కూడా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.రాష్ట్ర ప్రభుత్వ ఈవీ పాలసీని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత తయారీ కంపెనీలపై ఉందని మంత్రి స్పష్టం చేశారు. ఇప్పటివరకు రాష్ట్రంలో 1,59,304 ఎలక్ట్రిక్ వాహనాలకు రూ. 806.35 కోట్ల మేర రాయితీలు అందించినట్లు ఆయన వివరించారు. ఈవీల వినియోగం పెరగాలంటే మౌలిక సదుపాయాలు పటిష్ఠంగా ఉండాలని, అందుకే రాష్ట్రవ్యాప్తంగా పెట్రోల్ బంకులు, షోరూమ్‌ల వద్ద ఛార్జింగ్ స్టేషన్ల సంఖ్యను పెంచాలని అధికారులను, కంపెనీలను ఆదేశించారు .తెలంగాణ విజన్-2047లో భాగంగా 'జీరో ఉద్గారాల' లక్ష్యాన్ని చేరుకోవడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ లక్ష్యం దిశగా ప్రభుత్వం తనవంతుగా కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ప్రభుత్వ శాఖలు, సంస్థలు కొనుగోలు చేసే కొత్త వాహనాల్లో కనీసం 20 శాతం ఎలక్ట్రిక్ వాహనాలే ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించారు. ఇది దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.రహదారి భద్రతపై కంపెనీల బాధ్యత వచ్చే ఏడాది జనవరిలో నిర్వహించనున్న 'రహదారి భద్రత' వారోత్సవాల్లో ఈవీ తయారీ కంపెనీలు, డీలర్లు చురుగ్గా పాల్గొనాలని మంత్రి సూచించారు. వాహనదారులలో భద్రత పట్ల అవగాహన కల్పించేలా ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించాలని కోరారు. ఈ సమావేశంలో రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, కమిషనర్ ఇలంబర్తితో పాటు ప్రముఖ ఈవీ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# తుది దశకు ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్.. భారీ స్కై స్క్రాపర్లు, మెట్రో.. దుబాయ్ తరహాలో




హైదరాబాద్: : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఫ్యూచర్ సిటీ పనులు వేగంగా సాగుతున్నాయి. సింగపూర్ కన్సల్టెన్సీ సంస్థ తుది మెరుగులు దిద్దుతున్న ఈ అత్యాధునిక నగరంలో 15 వేల ఎకరాల్లో కోర్ సిటీ, మరో 15 వేల ఎకరాల్లో అర్బన్ ఫారెస్ట్ అభివృద్ధి చెందుతాయి. ముచ్చర్ల ప్రాంతంలో ప్రధాన ఏఐ సిటీతో పాటు, ఎకో-టూరిజం, స్పోర్ట్స్ సిటీ, భారీ ట్రాన్స్‌పోర్ట్ హబ్ కూడా రానున్నాయి. మెట్రో, గ్రీన్‌ఫీల్డ్ హైవేలతో అనుసంధానం చేస్తున్నారు. %తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన ఫ్యూచర్ సిటీ పనులు, ప్రణాళికలు వేగంగా ముందుకు కదులుతున్నాయి. ఈ క్రమంలో సింగపూర్‌కు చెందిన ప్రముఖ కన్సల్టెన్సీ సంస్థ.. ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుకు తుది మెరుగులు దిద్దే పనిలో ఉంది. మొత్తం 30 వేల ఎకరాల విస్తీర్ణంలో రాబోయే ఈ ఫ్యూచర్ సిటీని అత్యాధునిక నగరంగా తీర్చి దిద్దేందుకు ఈ కంపెనీ బ్లూప్రింట్ సిద్ధం చేస్తోంది. మొత్తం 30 వేల ఎకరాల్లో.. 15 వేల ఎకరాలను కోర్ సిటీ అభివృద్ధి కోసం కేటాయించగా.. మిగిలిన 15 వేల ఎకరాల ఫారెస్ట్‌ను అర్బన్ ఫారెస్ట్ కార్యక్రమాల కోసం వినియోగించనున్నారు. సింగపూర్ కన్సల్టెన్సీ తయారు చేసిన మాస్టర్ ప్లాన్ ప్రకారం.. ముచ్చర్ల, కందకూరు, మీర్‌ఖాన్‌పేట, పన్నెండు గ్రామాల పరిధిలోని వేల ఎకరాల్లో ఈ ఫ్యూచర్ సిటీ విస్తరించనుంది. హైవేకు ఇటువైపు కోర్ సిటీ, అటువైపు ఎకో -టూరిజం వచ్చేలా ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే ఈ ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్ ఒక కొలిక్కి వచ్చింది.ఫ్యూచర్ సిటీకి ఆయువుపట్టు వంటి ప్రాంతం ముచ్చర్ల. ఇక్కడ గతంలో ఫార్మా సిటీ కోసం భూములను సేకరించగా.. ఇప్పుడే అదే చోట ప్రధాన 'ఏఐ సిటీ'ని ప్రతిపాదించారు. ఈ ప్రాంతంలో.. దుబాయ్, న్యూయార్క్ నగరాల్లో మాదిరి కార్పొరేట్ ఆఫీసులు, ఆకాశహర్మ్యాలు, ఐటీ టవర్లు రాబోతున్నాయి. గూగుల్, అమెజాన్ వంటి డేటా సెంటర్లన్నీ.. ఈ హబ్‌లోనే ఏర్పాటు కానున్నాయి.ఓఆర్ఆర్ నుంచి వచ్చే ప్రధాన 300 అడుగుల రోడ్డు డైరెక్ట్‌గా ఈ ఏఐ సిటీని తాకుతుంది. ఈ ఫ్యూచర్ సిటీలో కాలుష్యానికి అవకాశం లేని 'గ్రీన్ ఫార్మా' కంపెనీలకు, డేటా సెంటర్లకు ప్రత్యేక క్లస్టర్లను కేటాయించారు. అలాగే జీరో లిక్విడ్ డిశ్చార్జ్ విధానంతో పని చేసే కంపెనీలకే ఇక్కడ అనుమతులు ఇచ్చారు.ఏఐ సిటీ కోసం భారీ స్కై స్క్రాపర్లతో కూడిన ఐటీ టవర్లను డిజైన్ చేశారు.మొత్తం 30 వేల ఎకరాల్లో సగ భాగం అంటే.. 15 వేల ఎకరాల అటవీ ప్రాంతంలో కొంత భాగాన్ని అర్బన్ ఫారెస్ట్‌గా అభివృద్ధి చేయనున్నారు. అంటే ఈ ప్రాంతంలో చెట్లు పెంచడమే కాక.. ఇక్కడ ఎకో టూరిజం యాక్టివిటీస్‌ను పెద్ద సంఖ్యలో ప్లాన్ చేస్తున్నారు. వీటితో పాటు సైక్లింగ్ జోన్లు, ట్రెక్కింగ్ మార్గాలు, వెల్‌నెస్ రిసార్టులు, నైట్ సఫారీలు ఇక్కడ రానున్నాయి. దీనికి ఒకపక్క దట్టమైన అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ కనెక్టివిటీ ఉంది.ఫ్యూచర్ సిటీలో కొండలు, గుట్టలు లేకుండా సాఫీగా ఉండే 3 వేల ఎకరాల మైదాన ప్రాంతాలను స్పోర్ట్స్ సిటీ కోసం కేటాయించారు. ఇక్కడ ఒలింపిక్స్ స్థాయి క్రీడలను నిర్వహించే సామర్థ్యంతో ఈ క్రీడా గ్రామాన్ని నిర్మించబోతున్నారు. దీనిలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంతో పాటు.. టెన్నిస్, ఫుట్‌బాల్, హాకీ స్టేడియాల కోసం ప్రత్యేక జోన్లను కేటాయించారు.నగరంలో ఏ మూల నుంచి అయినా సరే కేవలం 15 నిమిషాల్లో ఫ్యూచర్ సిటీకి చేరుకునేలా.. అంతర్గత రహదారులతో అనుసంధానం చేశారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి నేరుగా ఫ్యూచర్ సిటీ వరకు మెట్రో లైన్ ప్రతిపాదన సిద్ధమైంది.ఫ్యూచర్ సిటీలో ప్రధాన జంక్షన్ వద్ద భారీ 'ట్రాన్స్‌పోర్ట్ హబ్'ను ఏర్పాటు చేయనున్నారు. మెట్రో స్టేషన్, బస్ బే, ఎలక్ట్రిక్ వెహికల్ చార్జింగ్ స్టేషన్లు అన్నీ ఒకే చోట రానున్నాయి.

# రైల్వే శాఖ వినూత్న ప్రయోగం.. రైలు పట్టాల నుంచి కరెంట్ ఉత్పత్తి




హైదరాబాద్: ఖర్చు తగ్గించుకుని, ఆదాయం పెంచుకునే దిశగా రైల్వే శాఖ వినూత్న అడుగులేస్తోంది. రైలు పట్టాల మధ్య సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేసి, తక్కువ ఖర్చుతో విద్యుత్ ఉత్పత్తి చేయాలని భావిస్తోంది. వారణాసిలో విజయవంతమైన ఈ ప్రయోగాన్ని దేశవ్యాప్తంగా విస్తరించాలని రైల్వే బోర్డు ఆదేశించింది. భూసేకరణ భారం లేకుండానే సౌర విద్యుత్ ఉత్పత్తి పెంచేందుకు ఈ ప్రణాళిక దోహదపడుతుంది. దీని ద్వారా ఏటా 24 వేల కోట్ల రూపాయల ఖర్చును తగ్గించుకోవచ్చని భావిస్తోంది.ఖర్చు తగ్గించుకుని.. ఆదాయాన్ని పెంచుకునే దిశగా రైల్వే శాఖ నిర్ణయాలు తీసుకుంటుంది. దీనిలో భాగంగా విద్యుత్ ఉత్పత్తి కోసం రైల్వే శాఖ వినూత్న విధానాన్ని అమలు చేయడానికి సిద్ధమైంది. అది కూడా చాలా తక్కువ ఖర్చుతో. ఇందుకోసం రైలు పట్టాల మధ్యలో సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేయాలని రైల్వే శాఖ భావిస్తోంది. దీని ద్వారా పెద్ద ఎత్తున సౌర విద్యుత్తును ఉత్పత్తి చేయాలని నిర్ణయించుకుంది. ఇప్పటికే వారణాసిలో ఈ ప్రయోగం విజయవంతమైంది. త్వరలోనే ఈ విధానాన్ని దేశవ్యాప్తంగా విస్తరించాలని రైల్వే బోర్డు ఆదేశించింది.రైల్వే శాఖ తన రైళ్లను 100 శాతం విద్యుత్తుతో నడపాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం రైల్వే శాఖ.. ఏటా సుమారు రూ. 24,000 కోట్ల విలువైన విద్యుత్తును రైళ్లను నడపడం కోసం వాడుతోంది. విద్యుత్ డిమాండ్‌తో పాటు ఖర్చు కూడా పెరుగుతున్న నేపథ్యంలో.. రైల్వే శాఖ ప్రత్యామ్నాయ విద్యుత్ వనరులపై దృష్టి సారించింది. దీనిలో భాగంగానే సోలార్ విద్యుత్ ఉత్పత్తిని ఎంచుకున్న రైల్వే శాఖ.. ఇందుకోసం స్టేషన్ భవనాలు, సర్వీసు భవనాలపై సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేసింది. దీని ద్వారా ఇప్పటికే 898 మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేస్తోంది. అయితే, ఈ ఉత్పత్తి సరిపోవడం లేదు.సోలార్ విద్యుత్ ఉత్పత్తిని పెంచాలంటే, పెద్ద ఎత్తున ఖాళీ భూములు అవసరం. భూసేకరణకు అయ్యే ఖర్చు చాలా ఎక్కువగా ఉంటుంది. ఈ సమస్యను అధిగమించడానికి, రైల్వే శాఖ రైలు పట్టాల మధ్య ఉండే ఖాళీ స్థలాన్ని ఉపయోగించుకోవాలని నిర్ణయించింది. దేశంలో ప్రస్తుతం 1.35 లక్షల కిలోమీటర్ల రైల్వే ట్రాక్ ఉంది. పట్టాల మధ్య సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేయడం ద్వారా, భూసేకరణ భారం లేకుండానే సౌర విద్యుత్తును ఉత్పత్తి చేయవ చ్చని అధికారులు భావిస్తున్నారు.ఈ విధానాన్ని ప్రయోగా త్మకంగా వారణాసిలోని బెనారస్ లోకోమోటివ్ వర్క్స్ కు వెళ్లే ట్రాక్ మీద 70 మీటర్ల మేర అమలు చేశారు. 28 ప్యానెళ్లను ఏర్పాటు చేయడంతో, 15 కిలోవాట్ పీక్ సామర్థ్యంతో రోజుకు 67 యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతోంది. ఈ ప్రయోగం విజయవంతం కావడంతో, దేశవ్యాప్తంగా ఈ విధానాన్ని విస్తరించాలని రైల్వే బోర్డు నిర్ణయించింది. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వేకు లేఖ రాసి, ట్రాక్‌పై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుకు అనువైన ప్రాంతాలను గుర్తించాలని ఆదేశించింది.దక్షిణ మధ్య రైల్వే ఇప్పటికే సోలార్ విద్యుత్ ఉత్పత్తిలో చురుకుగా ఉంది. ప్రస్తుతం ఈ జోన్ పరిధిలో 9.3 మెగావాట్ల సామర్థ్యంతో సోలార్ వ్యవస్థలు పనిచేస్తున్నాయి. దీనిని 34 మెగావాట్లకు పెంచడానికి టెండర్లు కూడా ఖరారయ్యాయి. కాచిగూడ స్టేషన్ ఇప్పటికే 100 శాతం సోలార్ పవర్‌తో నడుస్తోంది. ఈ నేపథ్యంలో, పట్టాలపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు ప్రాజెక్టులో కూడా దక్షిణ మధ్య రైల్వే చురుకుగా వ్యవహరిస్తుందని అధికారులు తెలిపారు.అయితే, పట్టాల మధ్య సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేస్తే వాటికి భద్రత కల్పించడం పెద్ద సవాలుగా మారుతుంది. రాత్రింబవళ్లు వాటికి కాపలా ఏర్పాటు చేయడం సాధ్యం కాదు. దొంగతనాలు జరగకుండా నిరోధించడం, ఆకతాయిలు వాటిని ధ్వంసం చేయకుండా చూడటం కష్టతరం. ఈ నేపథ్యంలో, అన్ని ప్రాంతాల్లో ఈ ప్యానెళ్లను ఏర్పాటు చేస్తారా, లేక రైల్వే సిబ్బంది నిఘా ఉన్న ప్రాంతాలకే పరిమితం చేస్తారా అనేది తేలాల్సి ఉంది.










# చరిత్ర సృష్టించిన హార్దిక్ పాండ్యా.. ఏకైక ఆటగాడిగా వరల్డ్ రికార్డ్!



టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా చరిత్ర సృష్టించాడు. అంతర్జాతీయ టీ20ల్లో 2000 పరుగులతో పాటు 100 వికెట్ల మైలురాయి అందుకున్న తొలి భారత ఆటగాడిగా నిలిచాడు. మరే భారత ఆటగాడు కూడా కనీసం 1000 పరుగులు, 100 వికెట్లు తీయలేదు. సౌతాఫ్రికాతో అహ్మదాబాద్ వేదికగా జరిగిన ఆఖరి టీ20లో హార్దిక్ పాండ్యా ఈ ఫీట్ సాధించాడు.ఈ మ్యాచ్‌లో హార్దిక్ పాండ్యా విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగిన సంగతి తెలిసిందే. ఎదుర్కొన్న తొలి బంతినే సిక్సర్‌గా మలిచిన హార్దిక్.. తొలి 7 బంతుల్లోనే 31 పరుగులు చేశాడు. 16 బంతుల్లో సెంచరీ మార్క్ అందుకొని భారత్ తరఫున అత్యంత వేగంగా హాఫ్ సెంచరీ సాధించిన రెండో ఆటగాడిగా నిలిచాడు. ఈ క్రమంలోనే అంతర్జాతీయ టీ20ల్లో 2000 పరుగులు పూర్తి చేసుకున్నాడు.ఈ సిరీస్‌లోనే 100 వికెట్లు మైలురాయి అందుకున్న హార్దిక్ పాండ్యా.. టీ20ల్లో 100 వికెట్లతో పాటు 2000 పరుగులు చేసిన తొలి పేస్ ఆల్‌రౌండర్‌గా చరిత్రకెక్కాడు. ఓవరాల్‌గా ఈ ఫీట్ సాధించిన ఐదో ప్లేయర్‌గా నిలిచాడు. ఈ జాబితాలో బంగ్లాదేశ్ స్పిన్ ఆల్‌రౌండర్ షకీబ్ అల్ హసన్ 149 వికెట్లు, 2551 పరుగులతో అగ్రస్థానంలో ఉన్నారు.మలేసియా స్పిన్ ఆల్‌రౌండర్ వీరణ్‌దీప్ సింగ్ 109 వికెట్లతో పాటు 3180 పరుగులు చేయగా.. అఫ్గానిస్థాన్ స్పిన్ ఆల్‌రౌండర్ మహమ్మద్ నబీ 2147 పరుగులతో పాటు 104 వికెట్లు తీసాడు. జింబాబ్వే స్పిన్ ఆల్‌రౌండర్ సికిందర్ రాజా 102 వికెట్లతో పాటు 2883 పరుగులు చేశాడు. హార్దిక్ పాండ్యా 101 వికెట్లతో 2002 పరుగులు చేశాడు.

అంతర్జాతీయ టీ20ల్లో అత్యంత వేగంగా హాఫ్ సెంచరీ నమోదు చేసిన భారత బ్యాటర్లు(బంతుల్లో):

12 - యువరాజ్ సింగ్ VS ఇంగ్లండ్, డర్బన్, 2007 వరల్డ్ కప్

16 - హార్దిక్ పాండ్యా VS సౌతాఫ్రికా, అహ్మదాబాద్, 2025

17 - అభిషేక్ శర్మ VS ఇంగ్లండ్, వాంఖడే, 2025

18 - కేఎల్ రాహుల్ VS స్కాట్లాండ్, దుబాయ్, 2021

18 - సూర్యకుమార్ యాదవ్ VS సౌత్ ఆఫ్రికా, గువహటి, 2022

సిరీస్ భారత్ కైవసం..

ఈ మ్యాచ్‌లో భారత్ 30 పరుగుల తేడాతో సౌతాఫ్రికాను ఓడించింది. ఈ గెలుపుతో ఐదు టీ20ల సిరీస్‌ను 3-1తో కైవసం చేసుకుంది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 231 పరుగుల భారీ స్కోర్ చేసింది. తిలక్ వర్మ(42 బంతుల్లో 10 ఫోర్లు, సిక్స్‌తో 73), హార్దిక్ పాండ్యా(25 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్స్‌లతో 63) విధ్వంసకర హాఫ్ సెంచరీలతో చెలరేగారు. సౌతాఫ్రికా బౌలర్లలో కార్బిన్ బోష్ రెండు వికెట్లు తీయగా.. ఓట్నీల్ బార్ట్‌మన్, జార్జ్ లిండే తలో వికెట్ తీసారు.

# 'బ్యాటర్ సూర్య తప్పిపోయాడు'.. పేలవ బ్యాటింగ్‌పై సూర్య ఎకసెక్కాలు!

పేలవ బ్యాటింగ్‌తో ఇబ్బంది పడుతున్న టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తనపై తానే సెటైర్లు పేల్చుకున్నాడు. బ్యాటర్ సూర్య తప్పిపోయాడని, అతను బలంగా తిరిగి వస్తాడని చెబుతూ నవ్వులూ పూయించాడు.ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా శుక్రవారం అహ్మదాబాద్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన భారత్ 30 పరుగుల తేడాతో సౌతాఫ్రికాను చిత్తు చేసింది. ఈ గెలుపుతో ఐదు టీ20ల సిరీస్‌ను 3-1తో కైవసం చేసుకుంది. ఈ విజయానంతరం మాట్లాడిన సూర్యకుమార్ యాదవ్..టీమిండియా ప్రదర్శనపై సంతోషం వ్యక్తం చేశాడు.'సిరీస్ ప్రారంభం నుంచే మేం ఒక ప్రత్యేకమైన శైలిలో క్రికెట్ ఆడాలని అనుకున్నాం. సరిగ్గా మేం అనుకున్నట్లే ఆడాము. కొత్తగా ఏం చేయలేదు. అన్ని విభాగాల్లో స్వేచ్ఛగా రాణించాలనుకున్నాం. మేం ఆశించిన ఫలితాలు దక్కాయి. గత కొన్ని సిరీస్‌ల్లో ఈ దూకుడును మేం కొంచెం మిస్ అయ్యాం. మేం సరిగ్గా ఇలానే ఆడాలనుకుంటున్నాం. బ్యాటర్ సెట్ అయ్యాక దూకుడును ఆఖరి వరకు కొనసాగించాలని కోరుకున్నాం. ఈ రోజు అది ఫలించింది.బౌలింగ్‌లో కాస్త వినూత్నంగా చేయాలనుకున్నాం. పవర్ ప్లేలో బుమ్రాతో ఒక ఓవర్, డ్రింక్స్ తర్వాత మిడిల్ ఓవర్లలో వేయించి, డెత్‌లో మళ్లీ బౌలింగ్ చేయించాలనేది మా ప్రణాళిక. ఈ రోజు వాషింగ్టన్ సుందర్ అద్భుతంగా రాణించాడు. ఈ సిరీస్‌లో మాకు కొన్ని సవాళ్లు ఎదురయ్యాయి. కొన్ని సందర్భాల్లో మేం ఒత్తిడికి లోనయ్యాం. వాటిని మా కుర్రాళ్లు అద్భుతంగా అధిగమించారు.ఇది ఓ అద్భుతమైన సిరీస్. మా లక్ష్యాలన్ని మేం అందుకున్నాం. బహుశా మాకు లోటుగా ఉన్న విషయం ఏదైనా ఉందా? అంటే 'బ్యాటర్ సూర్యను కనుగొనడం. అతను ఎక్కడో తప్పిపోయాడు(నవ్వుతూ). కానీ అతను మరింత బలంగా తిరిగి వస్తాడు. వ్యక్తిగతంగా విఫలమైనా.. జట్టుగా సంతోషంగా ఉన్నాను. మేం కష్టాల్లో ఉన్న ప్రతిసారీ, ఎవరో ఒకరు బాధ్యత తీసుకొని మమ్మల్ని గట్టెక్కించారు. ఒక కెప్టెన్‌గా అది నాకు చాలా సంతృప్తిని ఇస్తుంది.'అని సూర్యకుమార్ యాదవ్ చెప్పుకొచ్చాడు.

# సంక్రాంతి 2026 వార్.. సిక్స్ కొట్టేది ఎవరు?

ప్రతి సంక్రాంతికి టాలీవుడ్‌లో క్రేజీ సినిమాలు పోటీపడటం సర్వసాధారణం. అయితే ఒక్కేసారి ఈ ఫెస్టివల్‌కు రెండు నుంచి మూడు సినిమాలు మాత్రమే బరిలో నిలిచేవి. కానీ ఈ ఏడాది మాత్రం ఏకంగా ఐదు క్రేజీ సినిమాలు పోటీపడుతున్నాయి. అందులో మెగాస్టార్ చిరంజీవి %-%మన శంకర వరప్రసాద్ గారు%-%తో పాటు పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ది రాజాసాబ్ కూడా ఉంది. మెగాస్టార్ చిరంజీవి, అనిల్ రావిపూడితో కలిసి తన మార్కు ఫ్యామిలీ అంశాలతో ఎంటర్‌టైన్‌మెంట్ ప్రధానంగా చేసిన మూవీ %-%మన శంకరవరప్రసాద్ గారు2025 సంక్రాంతికి %-%సంక్రాంతికి వస్తున్నాం మూవీతో సందడి చేసి బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ హిట్‌ని సొంతం చేసుకున్న అనిల్ రావిపూడి మరోసారి సంక్రాంతి బరిలోకి చిరుతో దిగుతున్నాడు. దీంతో ఈ సినిమాపై ఫ్యామిలీ ఆడియన్స్‌లో అంచనాలు తారా స్థాయికి చేరుకున్నాయి. జనవరి 12న ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఇక దీనికి రెండు రోజుల ముందు సంక్రాంతి సందడిని మొదలు పెడుతూ పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ మూవీ ది రాజా సాడ్‌రాబోతోంది.ప్రభాస్ కెరీర్‌లో ఫస్ట్ టైమ్ చేస్తున్న కామెడీ హారర్ మూవీ ఇది. పీపుల్ మీడియా బ్యానర్‌పై టి.జి. విశ్వప్రసాద్ అ్యంత భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. మారుతికిది తొలి పాన్ ఇండియా స్టార్ మూవీ కావడంతో ఈందరి దృష్టి ఈ ప్రాజెక్ట్‌పై పడింది. ఇప్పటికే విడుదలైన ట్రైలర్, టీజర్, ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాల్ని పెంచేస్తున్నాయి. ఇక వీటితో పాటు మాస్ మహారాజా తొలి సారి తన పంథాకు పూర్తి భిన్నంగా చేస్తున్న ఫ్యామిలీ డ్రామా మూవీ %-%భర్త మహాశయులకు విజ్ఞప్తి%-% జనవరి 13న ప్రేక్షకుల ముందుకు రాడబోతోంది. కిషోర్ తిరుమల కొంత విరామం తరువాత చేస్తున్న సినిమా ఇది. అషికా రంగనాథ్, డిపుల్ హయాతీ హీరోయిన్‌లు నటించిన ఈ మూవీపై కూడా మంచి




ఎక్స్ పెక్టేషన్స్ ఉన్నాయి.వీరితో సంక్రాంతి బరిలో తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు యంగ్ హీరోలు నవీన్ పొలిశెట్టి, శర్వానంద్ కూడా దిగుతున్నారు. నవీన్ పొలిశెట్టి దాదాపు రెండేళ్ల విరామం తరువాత చేసిన మూవీ %-%అనగనగా ఒక రాజు%-% మీనాక్షీ చౌదరి హీరోయిన్. కామెడీ ప్రధానంగా సాగే ఈ సినిమా జనవరి 14న రిలీజ్ కానుండగా, శర్వానంద్ నటిస్తున్న ఫ్యామిలీ డ్రామా %-%నారీ నారీ నడుమ మురారీ%-% కూడా ఇదే రోజున ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ తెలుగు సినిమాలతో పాటు దళపతి విజయ్ తమిళ డబ్బింగ్ మూవీ %-%జననాయకుడు%-% జనవరి 9నే బరిలోకి దిగుతోంది.సంక్రాంతి బరిలో ఎన్ని సినిమాలు దిగుతున్నా ఈ రేసులో పైచేయి సాధించేది ఎవరనే చర్చ టాలీవుడ్‌లో మొదలైంది. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ కామెడీ హారర్ థ్రిల్లర్ %-%ది రాజా సాబ్%-%తో బరిలోకి దిగుతున్నా తన క్రేజ్‌కు తగ్గ స్థాయిలో మాత్రం సందడి చేయలేకపోతోంది. కానీ మెగాస్టార్ %-%మన శంకర వరప్రసాద్ గారు%-% మాత్రం ఇప్పటికే ప్రేక్షకుల నుంచి అటెన్షన్‌ని గ్రాబ్ చేసి సంక్రాంతి సినిమాల రేస్‌లో ముందంజలో నిలచింది. మొదటి నుంచి ఓ కాన్సెప్ట్ ప్రకారం సినిమాని ప్రమోట్ చేస్తూ వస్తున్న అనిల్ రావిపూడి ఈ మూవీని తనదైన మార్కు పబ్లిసిటీలో సంక్రాంతి రేసులో ముందంజలో ఉండేలా చేయడం గమనార్హం. ఈ లెక్కన చూస్తే స్పీడు తగ్గిన %-%ది రాజా సాబ్%-%ని వెనక్కి నెట్టి సంక్రాంతి బరిలో బాక్సాఫీస్ వద్ద సిక్స్ కొట్టేది చిరంజీవే అని స్పష్టమవుతోంది.

# కొడుకు ఈవెంట్‌కు వచ్చేందుకు సుమ నో.. ఏం జరిగిందంటే?



యాంకర్ సుమ, నటుడు రాజీవ్ కొడుకు రోషన్ కనకాల.. రీసెంట్ గా మోగ్లీ మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. లవ్ అండ్ రొమాంటిక్ ఎంటర్టైనర్ గా రూపొందిన ఆ సినిమా.. డిసెంబర్ 13వ తేదీన ప్రేక్షకుల ముందుకు వచ్చింది. రీసెంట్ గా హైదరాబాద్ లోని థ్యాంక్స్ మీట్ నిర్వహించారు మూవీ మేకర్స్.ఆ ఈవెంట్ కు అటెండ్ అయిన రోషన్ కనకాల.. వేదికపై ఎమోషనల్ అయ్యారు. ముందుగా సినిమాను ఆదరించిన మూవీ లవర్స్ కు స్పెషల్ థ్యాంక్స్ చెప్పారు. ఆ తర్వాత సపోర్ట్ చేసిన మీడియా మిత్రులకు ధన్యవాదాలు తెలిపారు. అనేక మంది టాలీవుడ్ హీరోలు, వారి అభిమానులు తనకు ఫుల్ గా సపోర్ట్ చేశారని చెప్పుకొచ్చారు.హార్డ్ వర్క్, టాలెంట్, డిసిప్లిన్ ఈ మూడే ఎవరి సక్సెస్ అయినా కూడా డిసైడ్ చేస్తాయని చెప్పిన రోషన్.. మోగ్లీ సినిమా కోసం ప్రాణం పెట్టి కష్టపడ్డానని తెలిపారు. టీమ్ అంతా ఎంతో హార్డ్ వర్క్, లవ్ తో చేశారని కొనియాడారు. అయితే మోగ్లీని ఆడియన్స్ గెలిపించారన్న రోషన్.. ఆ తర్వాత తన పేరెంట్స్ సుమ, రాజీవ్ గురించి మాట్లాడారు.మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్ చేయాలని అమ్మ సుమను అడిగానని, కానీ ఆమె 'నీ హార్డ్ వర్క్ నమ్మి ముందుకు సాగు' అని చెప్పినట్టు గుర్తు చేశారు. సినిమా కోసం హార్డ్ వర్క్ చేశానని, కానీ బ్యాడ్ లక్ ఏంటంటే అమ్మ నాన్న ఇలా ఈవెంట్స్ కు రాలేరని తెలిపారు. ఒకవేళ వచ్చుంటే వారిద్దరి కాళ్లు మొక్కి నమస్కరించేవాడినని అన్నారు.ఎందుకంటే వాళ్లు లేకుంటే తాను లేనని, థాంక్యూ అమ్మా. థాంక్యూ నాన్న అంటూ ప్రేమను వ్యక్త పరిచారు. ప్రస్తుతం రోషన్ కనకాల కామెంట్స్ సోషల్ మీడియాలో ఫుల్ వైరల్ గా మారాయి. ఇక మోగ్లీ విషయానికొస్తే.. కలర్ ఫోటో మూవీతో అందరి దృష్టిని ఆకర్షించిన సందీప్ రాజ్.. మోగ్లీ సినిమాకు దర్శకత్వం వహించారు.పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ రూపొందించగా.. మూవీలో రోషన్ సరసన సాక్షి మడోల్కర్ హీరోయిన్ గా నటించారు. బండి సరోజ్ కుమార్ విలన్ రోల్ లో కనిపించగా.. హర్ష చెముడు కీలక పాత్ర పోషించారు. వారితో పాటు సుహాస్, రియా సుమన్ అతిథి పాత్రల్లో నటించారు. కాలభైరవ మ్యూజిక్ అందించారు.మోగ్లీ కథేంటంటే.. సినిమాలో అనాథైన రోషన్, ఎస్సై కావాలని లక్ష్యంగా పెట్టుకుంటాడు. షూటింగ్స్ లో పనిచేస్తూ కడుపు నింపుకుంటాడు. అప్పుడు ఓ మూవీల డూప్ గా నటించాల్సి వస్తుంది. ఆ సమయంలో డాన్సర్ తో ప్రేమలో పడతాడు. అప్పుడే ఎస్సై వారి మధ్యలోకి వస్తాడు. అతడు కూడా హీరోయిన్ పై కన్నేసి లోబరుచుకోవాలని చూస్తాడు. దీంతో హీరో హీరోయిన్లు అడవిలో ఉంటారు. చివరకు ఏమైందనేది పూర్తి సినిమా.

# హరీష్‌తో అల్లరి మాములుగా లేదుగా!



ప్రముఖ డైరెక్టర్ హరీష్ శంకర్ ప్రస్తుతం పవన్ కళ్యాణ్ హీరోగా ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాకి దర్శకత్వం వహిస్తున్న విషయం తెలిసిందే. వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం వేగంగా జరుపుకుంటుంది. ఇందులో శ్రీలీలా తో పాటు మరో హీరోయిన్ రాశి ఖన్నా కూడా కీలక పాత్ర పోషిస్తోంది. ఇకపోతే ఈమధ్య కాలంలో సోషల్ మీడియాలో యాక్టివ్గా ఉంటూ అభిమానులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్న రాశి ఖన్నా ఎక్కువగా ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా షూటింగ్ సెట్ నుంచి కొన్ని ఫోటోలను, అక్కడ నటీనటుల మధ్య సరదాగా సాగిన సంభాషణలను, అల్లరి పనులను సోషల్ మీడియా ద్వారా షేర్ చేస్తోంది.ఈ క్రమంలోనే తాజాగా షూటింగ్ సెట్ నుంచి మరో కొన్ని ఫోటోలను, వీడియోలను షేర్ చేసింది ఈ ముద్దుగుమ్మ.తాజాగా రాశి ఖన్నా షేర్ చేసిన ఫోటోలలో పచ్చని చెట్ల మధ్య వెచ్చని కాఫీ తాగుతూ ఒక ఫోటో షేర్ చేసిన ఈమె.. మరొక వీడియోలో హరీష్ శంకర్ తో చేసిన అల్లరికి సంబంధించిన వీడియోను కూడా పంచుకుంది. ఈ వీడియో చూసిన అభిమానులు హరీష్ తో అల్లరి మామూలుగా లేదుగా అంటూ కామెంట్లు చేస్తున్నారు. మొత్తానికైతే ఒకవైపు దర్శకుడిగా నటీనటులకు సినిమాలలో దిశా నిర్దేశం చేయడమే కాకుండా కాస్త గ్యాప్ దొరికితే చాలు వారితో సరదాగా కాలక్షేపం చేస్తూ తనలోని మరో యాంగిల్ ను బయటకు తీశారు డైరెక్టర్ హరీష్ శంకర్. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా విషయానికి వస్తే.. ప్రస్తుతం ఈ సినిమా చివరి షూటింగ్ కేరళకు షెడ్యూల్ చేయబడింది. ఈ సినిమాలోని కొన్ని కీలకమైన సన్నివేశాలను కేరళలోని దట్టమైన అటవీ ప్రాంతాలలో చిత్రీకరించనున్నట్లు చిత్ర బృందం తెలిపింది. డిసెంబర్ 19 నుంచి 22 వరకు షెడ్యూల్ చేయబడింది..సినిమా కథలో భాగంగా వచ్చే కొన్ని ఇంటెన్స్ ఫారెస్ట్ సీన్స్ కోసం మేకర్స్ కేరళ బ్యాక్గ్రౌండ్ ను ఎంచుకున్నట్లు సమాచారం. ఇకపోతే పవన్ కళ్యాణ్ ఇప్పటికే తన పార్ట్ షూటింగ్ పూర్తి చేయడంతో ఆయన ఈ షెడ్యూల్లో పాల్గొనడం లేదు.ముఖ్యంగా హీరోయిన్స్ అలాగే ఇతర ప్రధాన తారాగణం పై కొన్ని ముఖ్యమైన సన్నివేశాలను డైరెక్టర్ ఇక్కడ చిత్రీకరిస్తున్నారు. దీనికితోడు ఇప్పుడు రాశిఖన్నా కూడా ఈ షూటింగ్ స్పాట్ నుంచి కొన్ని ఫోటోలు షేర్ చేయడంతో అభిమానులు ఈ సినిమాపై అంచనాలు పెంచుకుంటున్నారు.. మైత్రి మూవీ మేకర్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ లో విడుదల కాబోతోంది. పవన్ కళ్యాణ్ విషయానికొస్తే ప్రస్తుతం ఈయన రాజకీయాల్లో బిజీగా ఉన్నప్పటికీ.. అభిమానుల కోసం ఈ సినిమాను అత్యంత వేగంగా పూర్తి చేయబోతున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY CHALLA SRIKANTH, PRINTED AT SRINIVASA PRINTERS D.NO 7-4-5, NEAR RAMALAYAM TEMPLE, BAPATLA WEST,(U) VILLAGE, BAPATLA -522101, GUNTUR DISTRICT, ANDHRA PRADESH, PUBLISHED AT D.NO 7-4-5, NEAR RAMALAYAM TEMPLE, BAPATLA -522101 GUNTUR DISTRICT, ANDHRA PRADESH,
EDITOR : CHALLA SRIKANTH, RNI : APBIL / 2023 / 86665, CELL: 6281086394 , EMIL SRIKANTH9550389070@GMAIL.COM